Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను
ప్రజాతీర్పు The people's Verdict తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly
సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను
వెంటనే కావలెను • బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు ఆర్‌సి ఇన్‌చార్జిలు •మండల రిపోర్టర్లు
అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 247 | హైదరాబాద్ | మంగళవారం 21 జూలై 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## ఇరాన్‌పై అమెరికా భారీ వైమానిక దాడులు

### బహ్రెయిన్, కువైట్‌పై ఇరాన్ ప్రతిదాడులు

దుబాయి: అమెరికా-ఇరాన్‌ల యుద్ధం మరింత వేడెక్కింది. సోమవారం ఉదయం ఇరాన్ లక్ష్యంగా అమెరికా మరోసారి దాడులకు తెగబడగా ఇరాన్ బహ్రెయిన్, కువైట్‌లపై ప్రతిదాడులకు దిగింది. ఇరాన్ వాయువ్య ప్రాంతంలో భూగర్భ క్షిపణి కేంద్రంగా భావిస్తున్న తబ్రిజ్ నగరం లక్ష్యంగా అమెరికా దాడులకు దిగగా ఒకరు మరణించినట్లు ఇరాన్ ప్రకటించింది. ప్రతీకారంగా ఇరాన్ బహ్రెయిన్‌తోపాటు అమెరికా నావికాదళపు ఫిఫ్త్ ఫ్లీట్ ఉన్న కువైట్‌పై క్షిపణులతో విరుచుకుపడింది. ఇరు దేశాల్లో సోమవారం ఉదయమే క్షిపణి దాడులకు సంబంధించిన హెచ్చరికలు జారీ అయ్యాయి. దూసుకొస్తున్న క్షిపణులను అడ్డుకున్నట్లు కువైట్ ప్రకటించింది. ఇరుదేశాల మధ్య యుద్ధానికి తాత్కాలిక విరామం ప్రకటిస్తూ గత నెలలో ఒక ఒప్పందం కుదిరినా ఆ తరువాత దాడులు, ప్రతిదాడులు కొనసాగుతూండటంతో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో కార్యకలాపాలు మళ్లీ

- మిగతా 2వ పేజీలో



## కొలిక్కి వచ్చిన డిలిమిటేషన్!

### 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదన.. దక్షిణ రాష్ట్రాల్లోని పార్టీలు ఒకే

తెలంగాణలో 25 నుంచి 26 పార్లమెంట్ స్థానాలు.. ఆంధ్రప్రదేశ్‌లో 37-38 వరకు..

ఆశావహుల్లో కొత్త ఆశలు.. గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో నాయకులు

**నియోజకవర్గాల పునర్విభజన కొలిక్కివచ్చినట్లే కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 50 శాతం సీట్ల పెంపునకు బీజేపీయేతర రాష్ట్రాలు సైతం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర ప్రతిపాదనను అంగీకరించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్ల విభజన జరిగితే ఉత్తరాది రాష్ట్రాల సీట్లు విపరీతంగా పెరిగి, జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పార్లమెంట్‌లో దారుణంగా పడిపోతుందనే భయాలు ఇన్నాళ్లూ ఉండేవి. అయితే, కేంద్ర ప్రభుత్వం తెరపైకి తెచ్చినట్లుగా ప్రచారం జరుగుతున్న యూనిఫాం 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదనతో దక్షిణ రాష్ట్రాలు సైతం సై అంటున్నట్లు సమాచారం.**

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

దీంతో రాష్ట్రంలో, దేశంలో నియోజకవర్గాలు పెరిగి కొత్త వారికి అవకాశం లభించనుంది. దీంతో ఇప్పటి నుంచి ఆశావహులు తమ పార్లమెంట్ స్థానాలపై కర్ఛీఫ్ వేసుకునే పనిలో పడ్డారు. కొత్తగా తమకు కలిసి వచ్చే ప్రాంతాలపై దృష్టి వేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో పడ్డారు. తెలుగు రాష్ట్రాలలో కూడా ఈ ఫార్ములాపై సానుకూల సంకేతాలే కనిపిస్తున్నాయి. ప్రధానంగా

- మిగతా 2వ పేజీలో




## భారత్‌కు తొలి డెంగ్యూ వ్యాక్సిన్

### 'క్యూడెంగా'కి డీసీజీఐ ఆమోదం

జపాన్‌కు చెందిన టకేటా కంపెనీ తయారీ

న్యూఢిల్లీ, జూలై 20 : డెంగ్యూను నివారించే తొలి వ్యాక్సిన్‌కు డ్రగ్స్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) ఆమోదం తెలిపింది. జపాన్‌కు చెందిన టకేడా బయోఫార్మా సూటికల్స్ కంపెనీ తయారు చేసిన 'క్యూడెం గా' వ్యాక్సిన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నాలు గు నుంచి 60 ఏళ్ల వయస్సు వారు ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చు. క్యూడెంగా (టీఏకే-003) ను జపాన్‌కు చెందిన ఔషధ సంస్థ టకెడా అభివృద్ధి చేసింది. ఇది లైవ్ అటెన్యుయేటెడ్ టెట్రావాలెంట్ వ్యాక్సిన్. అంటే డెంగ్యూ వైరస్‌లోని నాలుగు రకాలైన డెన్వీ-1, డెన్వీ-2, డెన్వీ-3, డెన్వీ-4పై రోగనిరోధక శక్తిని పెంచేలా రూపొందించారు. ఈ వ్యాక్సిన్‌ను 0.5 ఎంఎల్ చొప్పున మూడు నెలల వ్యవధిలో రెండు డోసులుగా ఇస్తారు. డబ్ల్యూహెచ్‌ఓ సిఫార్సు చేసిన ఈ వ్యాక్సిన్ ఇప్పటికే ఆసియాలోని 43 దేశాల్లో ఆమోదం పొందింది. భారత్‌లో ఏటా వేలాది మంది దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ బారిన పడుతున్నారు. చాలా

- మిగతా 2వ పేజీలో



## వర్షాలు బాగుండాలి వర్షాకాల సమావేశాలూ బాగుండాలి

### రెండూ బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభంలో మోదీ

న్యూఢిల్లీ: ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవాలని, అదేమాదిరి వర్షాకాల సమావేశాలు ఫలప్రదంగా సాగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం సందర్భంగా సోమవారం ఆయన పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. "రెండూ బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. అప్పుడు అందరి జీవితాల్లో వెలుగులు నిండుతాయి. ఇదే ఆశతో ఈసారి వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుందాం. అదే విధంగా ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సైతం ఫలప్రదంగా సాగాలనీ కోరుకుందాం. సభలో నిర్మాణాత్మక చర్చల ద్వారా దేశ ప్రగతికి, ప్రజా సంక్షేమానికి దోహదపడాలి. రాజకీయాలకు అతీతంగా అనుభవజ్ఞులైన ఎంపీల విజ్ఞానం దేశాభివృద్ధి కోసం ఉపయోగపడాలి. బలమైన

- మిగతా 2వ పేజీలో





## కలిసి నడుస్తారా?

### బండి.. ఈటెల మధ్య సయోధ్య

ఢిల్లీ పెద్దల సమక్షంలో కలిసిన నేతలు

చివరి వరకు కలిసి నడిచేనా?

మిగిలిన వర్గాల పరిస్థితి ఏమిటో?

ఎవరికి వారుగా గ్రూపులు

బీజేపీ లక్ష్యం నెరవేరేనా?

**నెక్ట్స్ టార్గెట్ తెలంగాణ అంటూ ఏకంగా ప్రధాని మోదీ ట్వీట్ చేసిన తర్వాత రాష్ట్రంలోని బీజేపీ నేతల్లో కొత్త జోష్ నెలకొంది. అధికారమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నా అంతర్గత విభేదాలు, నేతల మధ్య ఆధిపత్య పోరాటాలు పెద్ద తలనొప్పిగా మారాయి.**

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరిగినప్పటికీ, క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య సమన్వయ లోపం అధిష్ఠానాన్ని కలవరపెడుతోంది. దీంతో రాష్ట్రంలో బీజేపీని గాడిలో పెట్టేందుకు ఢిల్లీ పెద్దలు రంగంలోకి దిగారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్

- మిగతా 2వ పేజీలో

## చలో సంసద్.. రణరంగం



విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో పార్లమెంట్ ముట్టడికి యత్నించిన విద్యార్థులు, ఆందోళనకారులు

హోరువానను సైతం లెక్కచేయకుండా వేలాదిగా కదలిన యువత

కాక్రోచ్ కార్యకర్తలను చెదరగొట్టేందుకు లాఠీచార్జ్ చేసిన పోలీసులు

బాష్పవాయుగోళాల ప్రయోగం.. పలువురికి తీవ్ర గాయాలు

118 మంది పోలీసులకూ గాయాలు

ఆమరణ దీక్షావేదికను పూర్తిగా తొలగించిన పోలీసులు

- 2లో



### మా డిమాండ్లు నెరవేర్చండి

నడ్డాతో సీజేపీ ప్రతినిధుల చర్చలు

విన్నపాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్న మంత్రి

న్యూఢిల్లీ: దాదాపు మూడు వారాలుగా దీక్షపర్వంలో మునిగిపోయిన సీజేపీ కార్యకర్తలకు తొలిసారిగా ప్రభుత్వం నుంచి పిలుపొచ్చింది. దీంతో సీజేపీ అధికార ప్రతినిధులు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లు సోమవారం సాయంత్రం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా

- మిగతా 2వ పేజీలో

## కోల్డ్‌స్టోరేజీలో ప్రభుత్వం



### డెడ్ స్టోరేజ్‌లో రిజర్వాయర్లు

కాళేశ్వరం బటన్ నొక్కడానికి బాధేంటి?

అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

70 వేల ఉద్యోగాలపై సవాల్ స్వీకరించు రేవంత్?

గాచారం బాగాలేకనే మునిగే పడవలోకి పోచారం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బీఆర్ఎస్‌లో చేరిన బాన్సువాడ ప్రముఖ వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్

హైదరాబాద్, జూలై 20: రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, 'రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీల్లో ఉంటే ప్రభుత్వం కోల్ స్టోరేజ్‌లో పడుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎల్‌నినో వస్తుందని శాస్త్రవేత్తలు 6 నెలల ముందే హెచ్చరించినా ప్రభుత్వం స్పందించలేదని, ఇప్పుడు మీటింగులు పెట్టి ప్రయోజనం ఏమిటి? రైతులు ఇప్పటికే నష్టపోయారు' అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి ప్రణాళిక లేదని, దిశ లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికల ముందు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేశారని ఆరోపించారు. 'రెండేళ్లు దాటినా 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. కేసీఆర్ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలను తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటు' అని అన్నారు. 70 వేల ఉద్యోగాల నియామకంపై తన సవాల్‌కు ఇప్పటివరకు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పలేదన్నారు. 'నువ్వే 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు

- మిగతా 2వ పేజీలో

# కలిసి నడుస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ వచ్చి సీనియర్ నేతలతో వరుస భేటీలు నిర్వహించారు.

### కలిసిన అగ్రనేతలు

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య ఉన్న కోల్డ్ వార్ సమసింది. ఇంతకాలం వీరు పార్టీలో నేనంటే నేను అన్న చందంగా వ్యవహరించారు. ఇరు పార్టీల అనుచరులు సైతం తమకు అన్యాయం జరుగుతుందన్న భావనలో ఉన్నారు. తాజాగా వీరిద్దరి మధ్య అధిష్ఠానం సయోధ్య కుదిర్చింది. అయితే, పైకి ఇద్దరు నేతలు కలిసినట్లు కనిపించినా క్షేత్రస్థాయిలో వీరు కలిసి పని చేస్తారా అన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకమే.

### ఎవరికి వారేగా..

తెలంగాణ బీజేపీలో గొడవలు కేవలం బండి సంజయ్, ఈటల మధ్యే పరిమితం కాలేదు. రాష్ట్ర కమిటీలో ప్రతి ఒక్క అగ్రనేతకూ ఒక ప్రత్యేక గ్రూపు ఉందనేది బహిరంగ రహస్యం. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు, ప్రస్తుత రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడికి అస్సలు పడటం లేదని, అలాగే బండి సంజయ్‌తోనూ ఆయనకు తీవ్ర విభేదాలు ఉన్నాయి. ఇటు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి, రాష్ట్రంలోని ఇతర సీనియర్ నాయకులకు మధ్య కూడా సమన్వయం లోపించింది. త కాపులకు, వలస వచ్చిన నేతలకు మధ్య ఉన్న ఈ అంతర్గత రగడ వల్ల క్యాడర్ అయోమయంలో పడిపోతోంది. లోపల ఎన్ని విభేదాలు ఉన్నా అవి మీడియా ముందర బయటపడకూడదని, సొంత ఎజెండాలు పక్కనబెట్టి పార్టీ లైన్ ప్రకారం నడుచుకోవాలని అభయ్ పాటిల్ నేతలకు స్పష్టమైన క్లాస్ పీకారు.

### కలిసి నడిస్తేనే..

తెలంగాణలో ఎలాగైనా అధికారం దక్కించుకోవడానికి హైకమాండ్ ఒక భారీ వ్యూహాన్ని సిద్ధం చేసింది. గతంలో పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ ఏ రకమైన దూకుడు వ్యూహాన్ని అమలు చేసి, క్షేత్రస్థాయి పోలింగ్ బూత్‌లను పటిష్టం చేసుకుందో.. అదే తరహా మోడల్‌ను తెలంగాణలోనూ అమలు చేయాలని టార్గెట్ విధించింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు, సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని రోడ్ మ్యాప్ ఇచ్చింది. హైకమాండ్ గట్టిగా హెచ్చరించిన మాట నిజమే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో నేతలు తమ వ్యక్తిగత అహాలను పక్కనబెట్టి అంచనాలను అందుకోగలరా అనేది ఇప్పుడు అసలు ప్రశ్న. పైకి అంతా ఒకటే అని నటిస్తూ, లోపల ఒకరి సీటుకు ఒకరు ఎసరు పెట్టుకునే పాత రాజకీయాలకే నేతలు పరిమితమైతే బెంగాల్ టార్గెట్ రీచ్ అవ్వడం అసాధ్యం. మరి రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి మార్క్ కాంగ్రెస్‌ను ఢీకొట్టేందుకు ఈ కమలనాథులు ఏ మేరకు కలిసికట్టుగా నడుస్తారో చూడాలి.

# భారత్‌కు తొలి డెంగ్యూ వ్యాక్సిన్

(మొదటి పేజీ తరువాయి)

మంది మృతి చెందుతున్నారు. 2025 లో సుమారు లక్షకు పైగా కేసులు నమోద య్యాయి. ప్రపంచంలో నమోదయ్యే డెంగీ కేసుల్లో మూడోవంతు భారత్‌లోనే నమోదు అవుతున్నవేళ.. ఈ వ్యాక్సిన్‌కు డీసీజీఐ ఆమోదం తెలుపడం గమనార్హం. సుమారు నాలుగున్నరేళ్ల పరిశీలనలో ఆసుపత్రిలో చేరే పరిస్థితిని 84 శాతం వరకు తగ్గించినట్లు గుర్తించారు. ప్రయోగశాల పరీక్షల్లో నిర్ధారిత డెంగ్యూ కేసులపై దాదాపు 61 శాతం రక్షణ కల్పించినట్లు వెల్లడైంది. భారత్‌లో ఈ వ్యాక్సిన్ ధరను ఇంకా ప్రకటించలేదు. అయితే హైదరాబాద్‌కు చెందిన 'బయోలా జికల్-ఈ'తో టకెడా ఇప్పటికే ఉత్పత్తి ఒప్పం దం కుదుర్చుకుంది. ఏడాదికి ఐదు కోట్ల డోసుల తయారీ లక్ష్యంగా పెట్టుకుంది.

# కోల్డ్‌స్టోరేజీలో ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

రుజువు చేస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని చెప్పాను. కానీ ఆ సవాల్‌ను స్వీకరించే దమ్ము సీఎంకి లేదు' అని ఎద్దేవా చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై, సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై, పార్టీ మారిన పోచారంపై తీవ్ర విమర్శలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్ హనుమంత్ షిండే, జీవన్‌రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### గాచారం బాగాలేకనే కాంగ్రెస్‌లోకి పోచారం..

బాన్సువాడ ప్రజలు ఒకప్పుడు గులాబీ జెండాను ఎగరేసి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని విశ్వసించి గెలిపించారని, అయితే ఆయన ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోలేకపోయారని కేటీఆర్ అన్నారు. 'సింపుల్‌గా చెప్పాలంటే గాచారం బాగాలేకనే పోచారం వేరే దానికి పోయిండు. అంతే తప్ప ఇంకేం లేదు. ఎవడైనా తెలిసి తెలిసి మునిగే పడవ ఎక్కుతాడా? కాంగ్రెస్ అనేది అసలు ఉండే పార్టీయా? భవిష్యత్తు ఉన్న పార్టీయా? నాది కాంగ్రెస్‌లోనే పుట్టుక అని పెద్దపెద్ద డైలాగులు కొట్టి అందులో చేరాడు. ఇప్పుడు మింగలేక కక్కలేక, కుడితిలో పడ్డ ఎలుక లాగా గిలగిల కొట్టుకునే పరిస్థితికి చేరుకున్నాడు. ఈ వయసులో ఆ పెద్ద మనిషికి ఇంతకంటే అవస్థ అవసరమా?' అని ప్రశ్నించారు. నిన్నమొన్నటి వరకు శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తి ఇవాళ తాను ఏ పార్టీలో ఉన్నాడో కూడా చెప్పుకోలేని పరిస్థితి వచ్చిందని విమర్శించారు. రానున్న ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఓడించడమే బీఆర్ఎస్ కార్యకర్తల లక్ష్యంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ తిరుమలగా పేరుగాంచిన బాన్సువాడ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా వచ్చి కోట్లాది నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఆ సందర్భంగా దేవుడి మీద ఒట్టేసి 'నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకు మీతోనే ఉంటా' అని చెప్పిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇప్పుడు మాట తప్పారని ఆరోపించారు. 'దేవుడి మీద రేవంత్‌రెడ్డి ఒక్కడే ఒట్లు పెట్టి మోసం చేస్తాడనుకున్నాం. కానీ పోచారం కూడా మోసం చేశారు. ఆయనను ఇవాళ దేవుడు కూడా కాపాడలేడు. తెలంగాణ తిరుమల వెంకన్న స్వామి శాపం ఆయనకు తప్పకుండా తగులుతుంది. బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగురుతుంది. కార్యకర్తలు ధైర్యంగా ఉండండి. ఏ కష్టం వచ్చినా, ఏ నష్టం వచ్చినా మేము మీతోనే ఉంటాం' అని స్పష్టం చేశారు.

### బాన్సువాడలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

బాన్సువాడ, నిజామాబాద్ జిల్లా రైతులకు నీళ్లు అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీటిని వృథాగా సముద్రంలోకి వదులుతోందని కేటీఆర్ ఆరోపించారు. 'ఇక్కడ నీళ్లు లేవంటారు. కానీ అదే నీళ్లు కిందకు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌లో మోటార్లు నడుస్తున్నాయి. వరంగల్‌లో దేవాదుల, ఖమ్మంలో సీతారామ ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అక్కడ నీళ్లు ఉంటే ఇక్కడ ఎందుకు లేవు?' అని ప్రశ్నించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద జరిగిన నిరసనను గుర్తు చేస్తూ కేటీఆర్ మాట్లాడారు. రైతులకు నీళ్లు విడుదల చేయాలని కోరితే రక్తం గురించి వ్యాఖ్యలు చేశారని, అందుకు నిరసనగా మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి రక్తదానం చేసి ఎస్ఆర్ఎస్పీకి నీళ్లు విడుదల చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారని తెలిపారు. 'తెలంగాణ కోసం ప్రాణాలైనా ఇస్తాం. రైతుల కోసం రక్తం ఇవ్వడానికైనా సిద్ధం. కానీ రైతులను ఎండబెట్టే ప్రభుత్వాన్ని మాత్రం ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు.






# చలో సంసద్.. రణరంగం

## విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో పార్లమెంట్ ముట్టడికి యత్నించిన ఆందోళనకారులు

- హోరువానను సైతం లెక్కచేయకుండా వేలాదిగా కదలిన యువత
- కాక్రోచ్ కార్యకర్తలను చెదరగొట్టేందుకు లాఠీచార్జ్ చేసిన పోలీసులు
- బాష్పవాయుగోళాల ప్రయోగం.. పలువురికి తీవ్ర గాయాలు
- 118 మంది పోలీసులకూ గాయాలు
- ఆమరణ దీక్షావేదికను పూర్తిగా తొలగించిన పోలీసులు

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతంలో నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'చలో సంసద్ ర్యాలీ'రణరంగాన్ని తలపించింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే ఉభయసభల సాక్షిగా ఎంపీలను నిలదీసి విద్యార్థుల సమస్యలకు పరిష్కారం తేల్చుకుంటామంటూ వేలాది మంది కాక్రోచ్ పార్టీ కార్యకర్తలు, పరీక్షార్థుల తల్లిదండ్రులు సోమవారం పార్లమెంట్ దిశగా మొదలెట్టిన ర్యాలీ చివరకు ఉద్రిక్తంగా ముగిసింది. ఆదివారం అర్ధరాత్రి నాటికే జంతర్‌మంతర్‌లోని దీక్షా స్థలికి వేలాదిగా మద్దతుదారులు, విద్యార్థులు చేరుకుని సోమవారం ఉదయం పార్లమెంట్ దిశగా ర్యాలీ మొదలుపెట్టగా పోలీసులు మొదట్లోనే అడ్డుకున్నారు. పార్లమెంట్, సెంట్రల్ విస్టా, కన్నాట్ ప్లేస్, సమీప ప్రాంతాల్లో 163వ సెక్షన్‌ను విధించారు. ర్యాలీకి అనుమతిలేనందున ఐదుగురికి మించి గుమికూడవద్దని హెచ్చరించారు. వదంతులు వ్యాపించకుండా ఉండేందుకు సెంట్రల్ ఢిల్లీ పరిధిలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను కొన్ని గంటలపాటు పోలీసులు నిలిపేశారు. ఉద్యమకారులున్న చోట్ల జామర్‌లను ఏర్పాటుచేశారు. అయినాసరే పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ మరింత మంది విద్యార్థులు, కార్యకర్తలు, మద్దతుదారులు బస్సులు, ఆటోలు, బైక్‌లలో వేర్వేరు దారుల్లో పార్లమెంట్ సమీపానికి చేరుకున్నారు. స్కూల్ యూనిఫామ్‌లో పాఠశాల విద్యార్థులు మొదలు కాలేజీ స్టూడెంట్స్, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, వృద్ధులు, యోగేంద్ర యాదవ్ వంటి సామాజికవేత్తలు పెద్దసంఖ్యలో పార్లమెంట్ సమీప రోడ్లమీదకొచ్చారు. జాతీయజెండాలు చేతపట్టుకుని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలుచేశారు. భారత్ మాతాకీ జై, జై భీం, వందేమాతరం, ధర్మేంద్ర ప్రధాన్ దిగిపో నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. వీళ్లు ముందుకెళ్లకుండా పోలీసులు బారికేడ్లను అడ్డుగా ఉంచారు. వాటినీ ఆందోళనకారులు తొలగించారు. దీంతో వీళ్లను అదుపు చేయడం కోసం పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేశారు. దీంతో పలువురు తీవ్రస్థాయిలో గాయపడ్డారు. పార్లమెంట్ స్ట్రీట్, పటేల్ చౌక్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్, శాస్త్రీ భవన్, రైల్ భవన్ సమీప ప్రాంతాల్లో జనాన్ని చెదరగొట్టేందుకు బాష్పవాయుగోళాలు సైతం ప్రయోగించారు. పోలీసులు ఇష్టమొచ్చినట్లు చితకబాదుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తోటి కార్యకర్తలను కొడుతున్నాసరే ఇంకొందరు అలాగే రోడ్డు మీద బైఠాయించి 'కొట్టండి సార్ కొట్టండి'అని తమ తీవ్రస్థాయి నిరసన తెలపడం ఒక వీడియోలో కన్పించింది. "పోలీసులు కొందరి తల పగలగొట్టారు. కిందపడ్డ విద్యార్థులనూ వదల్లేదు"అని 55 ఏళ్ల హెలెన్ అనే మహిళ తెలిపారు. గాయపడిన వారిని తోటి విద్యార్థులు హుటాహుటిన సమీప ఆస్పత్రుల్లో చేర్పించారు. అయితే విద్యార్థుల నుంచి సైతం పోలీసులు తీవ్రస్థాయిలో ప్రతిఘటన ఎదుర్కొన్నట్లు పోలీసువర్గాలు తెలిపాయి. ఈ తోపులాటలో 118 మంది పోలీసులు గాయపడ్డారని పోలీసు వర్గాలు తెలిపాయి. తమపై జనం రాళ్లు రువ్వడంతోనే లాఠీచార్జ్ చేయాల్సివచ్చిందని పోలీసులు తమ చర్యను సమర్థించు కున్నారు. ఈ ఘటనలో 100కుపైగా ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ తర్వాత అందర్నీ విడిచిపెట్టే ఆస్కారముందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే సమీప రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రిలో 65 మెడికో లీగల్ కేసులు నమోదయ్యాయి. ర్యాలీలో లద్దాఖ్ సామాజికవేత్త, నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలిని పోలీసులు జుట్టు పట్టుకుని లాగి కొట్టారని వచ్చిన వార్త అవాస్తవమని ఢిల్లీ డీసీపీ సచిన్ శర్మ స్పష్టం చేశారు.

# కొలిక్కి వచ్చిన డిలిమిటేషన్!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో భారత రాష్ట్ర సమితి కూడా ఈ ప్రతిపాదన పట్ల సానుకూల ధోరణిలోనే ఉన్నట్లు సంకేతాలిచ్చింది. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి నిష్పత్తి దారుణంగా పడిపోనంత కాలం, ఈ యాభై శాతం పెంపుదల మోడల్ వల్ల తమకు వచ్చే నష్టమేమీ లేదని బీఆర్ఎస్ భావిస్తోంది. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 లోక్‌సభ స్థానాలు ఈ ఫార్ములా ప్రకారం 25-26 స్థానాలకు పెరుగుతాయి. అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉన్న 25 సీట్లు కాస్తా 37-38 స్థానాలకు చేరే అవకాశం ఉంది. దీనివల్ల ఇరు రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలకు క్షేత్రస్థాయిలో రాజకీయ పునరేకీకరణకు, ఎక్కువ మంది అభ్యర్థులకు అవకాశం కల్పించడానికి ఇదొక సువర్ణావకాశంగా మారనుంది.

### ప్రత్యామ్నాయం కంటే.. ఇదే బెటర్

నిజానికి ఈ 50 శాతం యూనిఫాం ఫార్ములాను వ్యతిరేకించే రాజకీయ పక్షాలు దక్షిణాదిలో దాదాపుగా ఉండకపోవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ ఏ పార్టీ అయినా ఈ ఫార్ములాను పట్టుబట్టి వ్యతిరేకిస్తే.. మరి జనాభా ప్రాతిపదికన కాకుండా దక్షిణాదికి న్యాయం జరిగే ప్రత్యామ్నాయ మార్గం ఏముందో వారు దేశానికి చెప్పాల్సి ఉంటుంది. డీలిమిటేషన్ ప్రక్రియను ఎల్లకాలం ఆపడం రాజ్యాంగబద్ధంగా సాధ్యం కాదు కాబట్టి, లభించే అత్యుత్తమమైన ప్యాకేజీని అందుకోవడమే తెలివైన రాజకీయ వ్యూహమనే అభిప్రాయానికి ప్రాంతీయ శ్రేణులు వస్తున్నాయి. వ్యతిరేకత కోసమే వ్యతిరేకిస్తే రాష్ట్రానికి వచ్చే అదనపు సీట్లను, కేంద్ర నిధుల వాటాలను కోల్పోవాల్సి వస్తుందనే ఆర్థిక కోణం కూడా ఇందులో దాగి ఉంది. ఈ ఫార్ములా వెనుక కేంద్రంలోని బీజేపీ పెద్దల మాస్టర్ ప్లాన్ స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాల జనాభా పెరుగుదలకు అనుగుణంగా అక్కడ కూడా 50 శాతం కంటే ఎక్కువ సీట్లు పెరిగే వెసులుబాటును ఉంచుతూనే, దక్షిణాది అలకను తీర్చడానికి ఇదొక బఫర్ జోన్ లాగా పనిచేస్తుంది. పార్లమెంట్ కొత్త భవనంలో 888 లోక్‌సభ సీట్ల వరకు కూర్చునేలా ముందే మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం కూడా ఈ ముందస్తు వ్యూహంలో భాగమేనని నెటిజన్లు గుర్తుచేస్తున్నారు.

### అన్ని పార్టీలు ఒకే ..

దక్షిణాది రాష్ట్రాల సీఎంలు ఇన్నాళ్లూ వ్యక్తం చేసిన జనాభా నియంత్రణ శిక్ష అనే వాదనకు ఈ ఫార్ములా పరోక్షంగా ఒక చక్కని పరిష్కారాన్ని చూపుతోంది. భారత రాజకీయ చరిత్రలో నియోజకవర్గాల పునర్విభజన అనేది ఒక సవాలుతో కూడిన ఘట్టం. కానీ ఈ యూనిఫాం 50 శాతం మోడల్ ద్వారా దక్షిణాది రాష్ట్రాలు డీలిమిటేషన్‌కు దాదాపుగా మానసికంగా సిద్ధమైనట్లే కనిపిస్తోంది. అటు ప్రాంతీయ అస్తిత్వం దెబ్బతినకుండా, ఇటు పార్లమెంట్‌లో సీట్ల సంఖ్య పెరిగి కేంద్రంపై ఒత్తిడి తెచ్చే అవకాశం లభిస్తుండటంతో.. డీఎంకే, బీఆర్ఎస్, తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ సహా దాదాపు అన్ని పార్టీలు ఈ కొత్త పొలిటికల్ రియాలిటీని స్వీకరించే దిశగానే అడుగులు వేస్తున్నాయి.

# మా డిమాండ్లు నెరవేర్చండి

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రధాన డిమాండ్లను మంత్రికి వెల్లడించారు. "ఎలాంటి షరతుల్లేకుండా ఆస్పత్రి నుంచి సోనమ్ వాంగ్‌చుక్‌ను విడుదలచేయాలి. ఆయన ఒక వీడియో సందేశం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. అందుకు అనుమతించాలి. ధర్మేంద్ర ప్రధాన్‌ను విద్యాశాఖ పదవి నుంచి తప్పించాలి లేదా ఆయనతో రాజీనామా చేయించాలి. నీట్--యూజీ,2026 ప్రశ్నపత్రాలు లీక్ కావడంతో తీవ్ర నిరాశతో బలవన్మరణాలకు పాల్పడిన పరీక్షార్థులకు తలో రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం ప్రభుత్వం తక్షణం ప్రకటించాలి. దీక్షాస్థలిని నాశనంచేసిన పోలీసులు ఇకపై కార్యకర్తల జోలికి వెళ్లకూడదు. శాంతియుత నిరసనను పోలీసులు ఉక్కుపాదంతో అణచివేసేందుకు యత్నించకూడదు"అని నడ్డాకు అందజేసిన లేఖలో సీజేపీ ప్రతినిధులు పేర్కొన్నారు. సీజేపీ డిమాండ్లపై ప్రభుత్వ నాయకత్వం అంతర్గతంగా చర్చించేలా చేస్తానని ప్రతినిధులకు నడ్డా హామీ ఇచ్చారు. సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయని తర్వాత నడ్డా మీడియాతో చెప్పారు. "మా షరతులను నడ్డాకు తెలిపాం. వీటిని తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన మాకు హామీ ఇచ్చారు"అని తర్వాత అశుతోష్ రంకా తెలిపారు. సోమవారం ఉదయం 11.50 గంటలకు సీజేపీ ప్రతినిధులతో ఫోన్‌లో మంతనాలు జరిపామని, సాయంత్రం వాళ్లు స్వయంగా వచ్చి మెమోరాండం సమర్పించారని నడ్డా చెప్పారు. ఇప్పటికే ఈ మూడు డిమాండ్లపై ప్రభుత్వ పెద్దలు అంతర్గతంగా చర్చలు జరుపుతున్నారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

### దీక్ష కొనసాగిస్తా వాంగ్‌చుక్

సంసద్ ర్యాలీలో పాల్గొనేందుకు తనను డిశ్చార్జ్ చేయాలని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌కు సోనమ్ వాంగ్‌చుక్ ఒక లేఖ రాశారు. ఆస్పత్రిలో తన ఆరోగ్యం బాగానే ఉందని, నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు పంపించాలని కోరారు. తాను నిరాహార దీక్షను విరమించాలంటే ప్రభుత్వం మూడు షరతుల్ని ఒప్పుకోవాలని చెప్పారు. "పేపర్ లీకేజీ ఉదంతాలకు తమదే బాధ్యత అని ప్రభుత్వం తన తప్పు ఒప్పుకోవాలి. లేదంటే ర్యాలీగా పార్లమెంట్‌కు వచ్చిన సీజేపీ నాయకులతో ఉభయసభల ఎంపీలు మాట్లాడి ఈ అంశాన్ని పార్లమెంట్‌లో చర్చిస్తామని వెంటనే హామీ ఇవ్వాలి. లేదంటే అధికార కూటమి ఎంపీలు ఆస్పత్రికి వచ్చి ఇదే అంశంపై నాకు స్వయంగా హామీ ఇవ్వాలి"అని వాంగ్‌చుక్ ఒక టిష్యూపేపర్ మీద షరతులు రాసి 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. కానీ ర్యాలీలో కార్యకర్తలతో పోలీసులు అమానుషంగా ప్రవర్తించిన కారణంగా తన దీక్షను ఇకమీదటా కొనసాగించాలని ఆయన ఆ తర్వాత నిర్ణయించుకున్నారు.

### దీప్కేను నిర్బంధించిన పోలీసులు!

దీక్షా స్థలి నుంచి సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కేను పోలీసులు రహస్య ప్రదేశానికి తరలించారని సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, అశుతోష్ ఆరోపించారు. సోమవారం సాయంత్రంకల్లా దీక్షా స్థలిలోని టెంట్లు, మైకులు, కార్పెట్లు, బ్యానర్లు, జెండాలను పోలీసులు తొలగించారు. అటువైపు ఎవరూ రాకుండా జంతర్‌మంతర్ వద్ద రోడ్డుకు రెండు వైపులా పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేశారు. దీంతో దాదాపు 1,000 మంది ఉద్యమకారులు కొంతదూరంలోనే నిలిచిపోయారు. సమీపంలోని కేరళ హౌస్ సమీపంలో భైఠాయించి ఇక్కడి నుంచే ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఉద్యమనేతలు స్పష్టంచేశారు. అయితే దీప్కేను అరెస్ట్‌చేశామన్న వార్తల్లో నిజంలేదని ఢిల్లీ పోలీసులు స్పష్టంచేశారు.

# ఇరాన్‌పై అమెరికా భారీ వైమానిక దాడులు

(మొదటి పేజీ తరువాయి)

స్తంభించిపోయాయి. ఇరుపక్షాలూ మౌలిక సదుపాయాలు లక్ష్యంగా దాడులు చేసుకుంటూండంతో చమురు ధరలు మళ్లీ పైకి ఎగబాకాయి. సోమవారం బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్ ధర 90 డాలర్ల కంటే ఎక్కువ పలికి ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది.

### బాగా దెబ్బకొట్టాం: ట్రంప్

ఇరాన్‌పై సోమవారం జరిగిన దాడులు బాగా జరిగినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒరాన్ డ్రోన్ దాడిలో శనివారం వీరసైనికుడి మరణానికి ప్రతీకారం తీర్చుకున్నామని ఆయన ప్రకటించారు.

# ఇంత అహంకారం సరికాదు

### ఇక్కడ బాధిత జాబితాలో కోర్టు ఉంది

## హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు అసంతృప్తి

హైదరాబాద్: ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోరాదంటూ ఉత్తర్వులున్నా పదే పదే కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్న హైడ్రా తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నీటి వనరులు, నాలాలు, కాలువల రక్షణకు చేపడుతున్న చర్యలు అభినందనీయమే అయినా ఇలా కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తుల భూముల్లోకి వెళ్లడం సరికాదంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలం లోతుకుంట గ్రామం సర్వే నం.1, 2లోని 40 ఎకరాల భూమిలో ఈనెల 17 హైడ్రా కూల్చివేతలు చేపట్టడాన్ని సవాలు చేస్తూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అత్యవసరంగా సోమవారం మరో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం.హరీశ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ ఈనెల 17న హైడ్రా అధికారులు కాంపౌండ్ కూల్చి అక్కడున్న నిర్మాణాలను ధ్వంసం చేశారన్నారు. ఇప్పటికే రెండు కోర్టు ధిక్కరణ పిటిషన్‌లలో ఉత్తర్వులకు విరుద్ధంగా చేశారని పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులున్నాయని చెప్పినా పిటిషనర్‌పై చేయి చేసుకున్నారన్నారు. సాయంత్రం వరకు కేసు నమోదు చేసి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాదనలను విన్న న్యాయమూర్తి హైడ్రా కమిషనర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకానొక దశలో కమిషనర్‌ను కోర్టు ముందు హాజరుపరచాలంటూ పోలీసులకు ఆదేశాలిస్తామన్నారు. చివరికి సాయంత్రం 6.30కు హాజరవుతానని హైడ్రా కమిషనర్ చెప్పడంతో విచారణను సాయంత్రానికి వాయిదా వేశారు.



## ఉద్యమంలా 'తెలంగాణ జలసిరి' కార్యక్రమం చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, జూలై 20 (ప్రజాతీర్పు)**

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ జలసిరి పోస్టర్ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీబీజీ రామ్ జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, డీఆర్డీఓ గీతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సర్ తోనే ఓటర్ గా గుర్తింపు

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**చొప్పదండి, జూలై 20 (ప్రజాతీర్పు):**

సర్ తోనే ఓటరుగా గుర్తింపు పొందడానికి అర్హత సాధించవచ్చు అని, చొప్పదండి నియోజకవర్గం లో ఇప్పటికే 80% సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. గంగాధర మండలం మధురానగర్ లో సోమవారం స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. బిఎల్వోల ద్వారా ఇప్పటికే గ్రామాల్లో ఎనీమరేషన్ ఫారాలను అందజేసినట్లు తెలిపారు. ప్రజలు సకాలంలో ఏన్యుమరేషన్ ఫారాలను నింపి బిఎల్వో లకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాము, ఎమ్మార్వో రజిత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ,సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య, గునుకొండ బాబు, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షులు ముద్దం నగేష్,సర్పంచ్ లు వేముల భాస్కర్,రేండ్ల శ్రీనివాస్, దాసరి శంకరయ్య,లింగాల లింగయ్య, పడాల రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఇంచార్జి డీపీఆర్ఓ గా శ్రీనివాసాచారి

**(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) జూలై 20**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి డీపీఆర్ఓ గా శ్రీనివాసాచారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా వ్యవహరిస్తున్న శ్రీనివాసాచారి ఇంచార్జి డీపీఆర్ఓగా బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. జర్నలిస్టులకు అందుబాటులో ఉండి.. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను చేరవేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టులు, అధికారులను సమన్వయంతో పని చేస్తూ ముందుకు వెళ్తానని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేస్తామని, త్వరితగతిన కార్డులు జారీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఇంచార్జి డీపీఆర్ఓ స్పష్టం చేశారు. అక్రిడీటేషన్ జారీ విషయం లో అక్రిడీటేషన్ సభ్యుల మధ్య పోరు జరుగుతుండడం తో అధికారులు జిల్లాకు రావాలంటే జంకుతున్నారు. మరో వైపు పాత్రికేయు లు అక్రిడిటేషన్లు రాక లబో దిబో మంటున్నారు. ఏది ఏమైనా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని పాత్రికేయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.




## విద్యుత్ ఉద్యోగుల నల్లబ్యాడ్జీల నిరసన

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 20.**

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లోని కోల్ మరియు యాష్ హ్యాండ్లింగ్ విభాగాల నిర్వహణను ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వం టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ జగిత్యాలలో విద్యుత్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ టి జి పి ఈ జె ఏ సి రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ రోజు జగిత్యాలలోని డివిజనల్ ఇంజనీర్ (డి ఈ) కార్యాలయ ప్రాంగణంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. సోమవారం ఉదయం డీఈ కార్యాలయానికి విచ్చేసిన విద్యుత్ ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను తెలియజేశారు. అనంతరం భోజన విరామ సమయంలో కార్యాలయ ప్రాంగణంలో ప్రైవేటైజేషన్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా జె ఏ సి నాయకులు మాట్లాడుతూ, లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో కీలకమైన విభాగాలను ప్రైవేట్ పరం చేయడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగుల హక్కులకు, సంస్థ మనుగడకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ టెండర్ల ప్రక్రియను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యాలయంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ౧౼ాజుజీూజ సెక్రటరీ జనరల్ రాంజీ నాయక్ ,కన్వీనర్ ఆర్ముల్ల ప్రసాద్ ,ఏఈలు సుందర్ సతీష్ ,శంకర్ తో పాటు డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# చిలకనగర్ డ్రైనేజీ, రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి

**(వినోద్, ప్రజా తీర్పు, మేడ్చల్ జిల్లా) జులై 20**



ఉప్పల్శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా గారిని కలిసి నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలపై చర్చించారు.

ఈ సందర్భంగా చిలకనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్, అభయాంజనేయ స్వామి గుట్ట, మైసమ్మ గుడి ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు, డ్రైనేజీ నీటి అవుట్‌లెట్ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే చిలకనగర్ చౌరస్తాలోని హనుమాన్ ఆలయం నుంచి మైసమ్మ గుడి వరకు రోడ్డు పనులకు ఇప్పటికే ఆమోదం లభించినప్పటికీ, మధ్య వరకు మాత్రమే రోడ్డు వేసి మిగిలిన భాగాన్ని తవ్వి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. త్వరలో బోనాల పండుగ నేపథ్యంలో పోచమ్మ, మైసమ్మ ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, రహదారి పనులను తక్షణమే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ రాధిక గుప్తా కి వినతిపత్రం అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిలుకానగర్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి ఈరెల్లి రవీందర్ రెడ్డి చేర్యాల శ్రీనివాస్ గడ్డం పాపిరెడ్డి పాల్గొన్నారు. ఉప్పల్ చిలకనగర్ డివిజన్‌లోని డ్రైనేజీ, వర్షపు నీటి అవుట్‌లెట్ సమస్యలతో పాటు హనుమాన్ ఆలయం నుంచి మైసమ్మ గుడి వరకు అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ని కలిసి వినతిపత్రం అందజేశారు. బోనాల పండుగ దృష్ట్యా భక్తులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.



## శంబునిగూడెం యువతి సుమ మృతిపై ఎమ్మెల్యే కోరం కనకయ్య దిగ్భ్రాంతి

**(పొనకంటి ఉపేందర్ రావుప్రజాతీర్పు) జులై 20**

మండలంశంబునిగూడెం గ్రామానికి చెందిన భట్టు భద్రయ్య కుమార్తె సుమ బలవన్మరణం చెందిన విషయం తెలుసుకున్న ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ కూడా ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ ఘటనకు కారణమైన వారిపై వెంటనే కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు నిర్వహించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరంకనకయ్య.పోలీసుఅధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అన్ని విధాలుగా సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.అనంతరం మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## 15 లక్షలతో సిసి రోడ్ నిర్మాణ పనులను ప్రారంభించిన చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) జులై 20**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి శాసనసభ్యులు,గడ్డం వినోద్ వెంకటస్వామి, ఆదేశాల మేరకు బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డ్ లో యుఐడిఎఫ్ నిధులు రూ.15 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి.దావ స్వాతి-రమేష్ బాబు మరియు స్థానిక వార్డు కౌన్సిలర్ పీక ఎల్ల బాయ్ శ్రీమతి.జంగం కల్పన-గౌస్ కాంగ్రెస్ నాయకులు కంకటి శ్రీనివాస్,పీక లక్ష్మణ్, నీలీ కృష్ణ,తదితరులు పాల్గొన్నారు



## ప్రజావాణి కార్యక్రమం ఆకస్మికం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్...

- ఎస్.ఐ.ఆర్ నమోదు శాతాన్ని వేగవంతం చేయాలి

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 20.**

సోమవారం జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ప్రజల నుండి అందుతున్న వినతులు, ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యం తో గత వారం నుండి డివిజన స్థాయిలో ప్రజా వాణి కార్యక్రమాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సానుభూతితో విని, శాఖల వారీగా సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం చేకూరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ వివరాలను జగిత్యాల డివిజనల్ పరిధిలోని తహసీల్దార్ లను అడిగి తెలుసుకున్నారు. నమోదు శాతాన్ని పెంచి ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా 100% పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లు, సంబంధిత అధికారులు, కార్యాలయ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## సిట్‌ను పునర్ వ్యవస్థీకరించండి.. అయోధ్య కేసులో సుప్రీంకోర్ట్

న్యూఢిల్లీ: అయోధ్య విరాళాల చోరీ కేసులో సిట్‌ను పునర్వ్యవస్థీకరించాలని సుప్రీం కోర్ట్ సోమవారం యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దర్యాప్తు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని, దాన్ని తార్కిక ముగింపునకు తీసుకెళ్లాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం నొక్కి చెప్పింది. ఈ తరహా కేసుల్లో అనుభవమున్న సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో ప్రత్యేకంగా దర్యాప్తు కోసం మాత్రమే సిట్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుందని తాము భావిస్తున్నట్టు కోర్టు తెలిపింది.

# బాలికల ఉన్నత విద్యకు అజీమ్ ప్రేమ్‌జీ ఉపకార వేతనాలు అండ

- విద్యార్థినులకు సన్మానం చేసిన ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్
- పెద్దపల్లి నియోజకవర్గంలో వంద మందికి పైగా బాలికలకు లబ్ధి

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 20**



ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పేద, ప్రతిభావంతులైన విద్యార్థినులకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ అందిస్తున్న ఉపకార వేతనాలు ఆర్థికంగా ఎంతో భరోసానిస్తున్నాయని స్వేరోస్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత భారతీయ పోలీసు సేవల అధికారి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉన్నత విద్యను కొనసాగిస్తున్న విద్యార్థినులకు ఈ ఉపకార వేతనాలు వరంగా మారుతున్నాయని పేర్కొన్నారు. పెద్దపల్లి పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో సోమవారం స్వేరోస్ ఇంటర్నేషనల్, స్వేరోస్ విజ్డమ్ సంయుక్త ఆధ్వర్యంలో అజీమ్ ప్రేమ్‌జీ ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థినులకు అభినందన, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ విద్యార్థినులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ, బీటెక్నాలజీ, బీఎస్సీ నర్సింగ్‌తో పాటు వివిధ స్నాతక, డిప్లొమా కోర్సులు అభ్యసిస్తున్న అర్హులైన విద్యార్థినులకు కోర్సు పూర్తయ్యే వరకు ప్రతి సంవత్సరం రూ.30 వేల చొప్పున బోధనా రుసుము, ఇతర విద్యా ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన వంద మందికి పైగా విద్యార్థినులు ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని, వారి కోసం దాదాపు రూ.కోటి మేర నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని విద్యలో ప్రతిభ కనబరచాలని సూచించారు. జీవితంలో విజయాలు సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర అధ్యయనం అవసరమని ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను చదివి స్ఫూర్తి పొందాలని, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ ఇంటర్నేషనల్ రాష్ట్ర నాయకులు కన్నూరి శ్రీశైలం, మహాదేవ్ గురూజీ, దాసరి ఉష, మేకల రవీందర్, వేల్పుల సురేందర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కొంకని శేఖర్, జిల్లా అధ్యక్షుడు మల్లారపు మహేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్, ఫిట్ అండ్ ఫ్యూచర్ జిల్లా అధ్యక్షుడు మచ్చ రాహుల్, ఇతర నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ లేనందున స్థానిక తాసిల్దార్‌కి జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రం






**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 20**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కి విషయం కబ్జాలకు గురవుతున్న కన్నాల శివారు సర్వే నంబర్ 60, మరియు 112, భూములను భూ మాఫియా, కబ్జా కోరల్లో నుండి కాపాడి ఇంటి స్థలాలు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించి ఇంటి స్థలాలు లేని పేదలకు న్యాయం చేయట గురించి, మరియు భూకబ్జాదారుల పై తమరు తీసుకున్న చర్యలు ఏమిటి. కన్నాల గ్రామపంచాయతీ శివారులో సర్వే నంబర్ 60,112,142,143,114. లలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఇట్టి భూములను రియల్ ఎస్టేట్, భూ మాఫియా, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆయా పార్టీల లో చేరి, కబ్జాలు చేసే దళారీలు, బడా వ్యాపారస్తులకు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించిన కాంట్రాక్టర్ , కన్నాల కబ్జాలు చేసి విక్రయించటం, సింగిల్ రూమ్ లు నిర్మించి గ్రామపంచాయతీ నుండి పాత గతించిపోయిన సంవత్సరాలు, తేదీలలో ఇంటి పన్నులు కట్టినట్టు రసీదులు సృష్టించి వాటిని విక్రయించడం, రెవెన్యూ వారేమో ఎకరాల కొద్ది లావని పట్టాలు చేయటం, పరిపాటిగా మారిపోయింది. ఇంతే కాకుండా ఈ ప్రాంతంలో కొద్ది మొత్తం లో పట్ట భూమి కొనుగోలు చేసి దానిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను కూడా తమ వెంచర్లలో కలుపుకొని ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఎర్రకుంట చెరువును సైతం కబ్జా చేశారు. దీనిని పునరుద్ధరించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు కలెక్టర్ స్థాయిలో ఫిర్యాదు చేశాయి. తమరు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి విచారణ కూడా జరిపి ఇరిగేషన్ అధికారులకు సూచనలు కూడా చేశారు. సర్వేలు కూడా జరిపించారు. కానీ పాత మ్యాపుల్లో ఉన్న చెరువు భూమి రియల్ ఎస్టేట్ వారికి అనుకూలంగా కుదిరించబడింది. చెరువు మత్తడి, కట్ట, నిర్మిస్తామని, తాత్కాలికంగా ఇసుక బస్తాలతో గండి పూర్తి చేస్తామన్న ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తున్న వారికి నాల, డి. సి. సి. పి. అనుమతులు లేవు ప్రభుత్వ భూముల్లో నిర్మిస్తున్న వాటిని గ్రామపంచాయతీ వారు ఇంటి నెంబర్లు అనుమతులు ఇస్తూ రియల్ ఎస్టేట్ భూ మాఫియాతో కుమ్మక్కై ప్రభుత్వ భూములు కబ్జా చేసే వారికి తోడ్పడుతున్నారు. గుట్టలకు గుట్టలు తొలిచి ఎర్రగుంట చెరువులో నింపి ఆ నేమెళ్ళ గుట్టను కూడా అక్రమించారు వీరిపై ఎటువంటి చర్యలు లేవు, కారణం వీరు, వీరి వెనుక బలమైన రాజకీయ నాయకుల అండదండలతో అధికారుల పై ఒత్తిడి తీసుకురావడమే కారణం. ఇప్పటికైనా పైన పేర్కొన్న అన్ని విషయాల పట్ల కులక షంగా పరిశీలించి, విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవలసిందిగా ప్రభుత్వ భూములను కాపాడాలని కబ్జాదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని విప్లవ కార్మిక సంఘాల జేఏసీగా మేము విన్నవిస్తున్నాము. మరి ముఖ్యంగా గత వారం క్రితం నేమిల గుట్టను తొలిచి పనులు వెంచర్స్ చేస్తున్నారు ఇట్టి విషయమై బెల్లంపల్లి డిప్యూటీ తాసిల్దార్ ని సంప్రదించగా మాకు ఎలాంటి సంబంధం లేదు మైనింగ్ అండ్ జియాలజికల్ వారిని సంప్రదించాలని చెప్పినారు మేము వెళ్లి ఏడి గారిని సంప్రదించగా గుట్టలను తొలిచే దానికి మేము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పడం జరిగినది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు తక్షణమే చొరవ తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు గైకొనాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మరియు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నాము. లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో జరగబోయే ఆందోళన కార్యక్రమాలకు సంబంధిత అధికారులు బాధ్యత వహించవలసి ఉంటుంది అనితెలియ చేస్తున్నాం తమరు భూ కబ్ధదారులపై ఎలాంటి చర్యలు తీసుకపోక పోవడం ద్వారానే పెట్రేగిపోతున్నారనేదానికి నిదర్శనం. మేము గత సంవత్సరం నుండి తమకు భూ కబ్జాదారుల విషయంపై ఆర్జీలు ఎన్ని పెట్టిన ఫలితం మాత్రం శూన్యం..

**విప్లవ కార్మిక సంఘాల జేఏసీ**

1) టీ .మణిరాం సింగ్ టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి
2) అంబాల మహేందర్ రాష్ట్ర నాయకులు, సింగరేణి గణి కార్మిక సంఘం(ఎస్ జి కే ఎస్ )
3)వీ. పోశ మల్లు, శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ( ఏఐఎఫ్టియు )
4) గోగర్ల శంకర్ రాష్ట్ర నాయకులు ( టియుసిఐ )



## కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో సూరారం పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన కే బాలరాజుకి ఘన సన్మానం

**సూరారం, జులై 20 (ప్రజాతీర్పు)**

సూరారం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ బాలరాజు ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గాజుల రామారం డివిషన్ మాజీ కార్పొరేటర్ శ్రీ రావుల శేషగిరి , బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీ నల్ల జై శంకర్ గౌడ్, మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీ పులి బలరాం , శ్రీ శ్రీరాములు , శ్రీ మాధవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీ కే బాలరాజు గతంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించిన సమయంలో, ముఖ్యంగా కరోనా మహమ్మారి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి శాంతి భద్రతలను సమర్థవంతంగా పరిరక్షించారని కొనియాడారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, నిష్పాక్షికంగా పరిష్కరించే అధికారిగా మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. మళ్లీ సూరారం పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టడం స్థానిక ప్రజలకు ఆనందదాయకమని తెలిపారు. ఆయన నాయకత్వంలో సూరారం పరిధిలో శాంతి భద్రతలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు సత్వర న్యాయం, మెరుగైన పోలీసు సేవలు అందుతాయనే పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీ కే బాలరాజుకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు ఇదే సేవాభావంతో న్యాయం చేయాలని ఆకాంక్షించారు.



## బస్తీ దవాఖానల మంజూరు కోసం ఆరోగ్య శాఖ డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**(వినోద్, ప్రజా తీర్పు,ఉప్పల్ మేడ్చల్ జిల్లా) జులై 20**

ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలంగాణ ఆరోగ్య ఒ కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ సంగీత సత్యనారాయణ ని మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గంలో కొత్త బస్తీ దవాఖానలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో వేగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రజలకు వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు, ఉచిత మందులు, అవసరమైన వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా అదనపు బస్తీ దవాఖానలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ వినతిపై ఆరోగ్య శాఖ డైరెక్టర్ సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ప్రతి అంశంపై ప్రభుత్వం దృష్టి సారించేలా నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.

# జమ్మికుంటలో ఈ నెల 27న పెయింటింగ్ పనుల బంద్

### పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వెల్లడి

**జమ్మికుంట, జూలై 20 ప్రజాతీర్పు**

జమ్మికుంట పట్టణ పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (యు.పి. పెయింటర్స్) సభ్యుల సంక్షేమం, వృత్తిపరమైన హక్కుల రక్షణకై సంఘం పలు కీలక నియమ నిబంధనలను రూపొందించినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ పరిధిలోని సభ్యులందరూ సంఘం నిర్ణయించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సంఘ సభ్యుడైన ప్రతి పెయింటింగ్ మేస్త్రీ గరిష్ఠంగా ఎనిమిది మంది లేబర్లతో మాత్రమే పనులు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సంఘం నిర్ణయించిన ప్రామాణిక పని రేట్లను తగ్గించి పనులు చేసినా, లేదా స్థానిక పెయింటర్స్ సభ్యులకు ఉద్దేశపూర్వకంగా పనులు రాకుండా అడ్డుపడే ప్రయత్నాలు చేసినా సంబంధిత సభ్యులపై క్రమశిక్షణా చర్యలతో పాటు సభ్యత్వాన్ని రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ నెల 27-07-2026 నాడు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబోయే కీలక సమావేశం దృష్ట్యా జమ్మికుంట పట్టణ పరిధిలో అన్ని రకాల పెయింటింగ్ పనులను పూర్తిగా బంద్ పెడుతున్నట్లు అసోసియేషన్ ప్రకటించింది. ఆ రోజున పట్టణంలోని పెయింటింగ్ మేస్త్రీలు, లేబర్లతో పాటు పి.ఓ.పి వర్క్ చేసే కార్మికులు కూడా విధిగా సంఘ సమావేశానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. సంఘ నిర్ణయాన్ని ధిక్కరించి బంద్ రోజున పనులకు వెళ్లినట్లు తెలిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రూ. 5,000/- జరిమానా విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు. వృత్తిదారుల బాగు కోసం సభ్యులందరూ సంఘ నిర్ణయాలను గౌరవించి, నిబంధనలకు కట్టుబడి సహకరించాలని కోరారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు బక్కె రవీందర్, ప్రధాన కార్యదర్శి చోలేటి శ్యామ్ కుమార్, ఉపాధ్యక్షులు పొడేటి మొగిలి, కోశాధికారి మైస శ్రీను, ప్రచార కార్యదర్శి కల్లెపల్లి రమేష్, కార్యవర్గ సభ్యులు కొండపాక సమ్మయ్య, వంతడుపుల అనిల్, జక్కె ప్రభాకర్, జమీర్, యు.పి. రాజు తదితరులు ఉన్నారు.





## జగిత్యాలలో పెన్షనర్లకు హెల్త్ కార్డుల పంపిణీ:

- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సమక్షంలో...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 20.**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సంఘం జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై, పెన్షనర్లకు నూతన హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే ఈ నూతన హెల్త్ కార్డులను అందిస్తోందని తెలిపారు. పెన్షనర్లు ఈ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బోలుశాని శ్రీనివాస్, కుతురు శేఖర్, కో-ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కరబూజ రవీందర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

## కోరుట్ల బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా భరద్వాజ్ శర్మ ఏకగ్రీవ ఎన్నిక

**కోరుట్ల జూలై 20 (ప్రజాతీర్పు)**



కోరుట్ల పట్టణంలోని స్థానిక ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన బ్రాహ్మణ సంఘ సభ్యుల సమావేశంలో సంఘ నూతన అధ్యక్షుడిగా మహాదేవస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు పాలెపు కార్తీక్ భరద్వాజ్ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎన్నికల పరిశీలకులు బ్రహ్మన్నగారి శంకర్ శర్మ మరియు పాలెపు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో భరద్వాజ్ శర్మను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం రెండేళ్లపాటు బాధ్యతలు నిర్వహించనున్నట్లు ఎన్నికల పరిశీలకులు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు భరద్వాజ్ శర్మ మాట్లాడుతూ, సంఘ సభ్యుల సహకారంతో బ్రాహ్మణ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని, సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫణీంద్ర శర్మ, రమేష్ శర్మ, కిషన్ శర్మ, శ్రీధర్ శర్మ, నితిన్, అరుణ్ శర్మ, రంగాచార్య, పూర్ణచందర్, అశోక్ రావు, దివాకర్, యశస్వి తదితరులు, బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

- సోనమ్ వాంగ్‌చుక్ పిలుపులో భాగంగా చలో పార్లమెంట్ కి వెళ్తున్న యువకులపై లాఠీఛార్జ్ చేయడాన్ని ఖండించండి
- పిడిఎస్ యూ విజ్రుం భణ డిమాండ్

**(వి వెంకటేష్ ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 20**



నీట్ పేపర్ లీక్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 20 మంది విద్యార్థులకు న్యాయం చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేపర్ లీకేజ్ కి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా అనేక రూపాల్లో ఆందోళన, జరుగుతున్నప్పటికీని కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం సరైంది కాదని, విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడనాడి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే బర్త్ రఫ్ చేయాలని, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే తన డిమాండ్లపై కనీసం చర్చించకుండా బలవంతంగా పోలీసు బలగాలు వచ్చి దీక్షను విరమింప చేయడం దేనికి నిదర్శనం అని పి డి ఎస్ యు విజృంభణ మంచిర్యాల జిల్లా కన్వీనర్ కంబాల మహేష్ అన్నారు. సోమవారం సోనం వాంగ్ చుక్ పిలుపులో భాగంగా యువకులు పార్లమెంటు ముందు నిరసనకు బయలుదేరిన క్రమంలో యువకులపై పోలీసులు విచక్షణ రహితంగా లాఠీ చార్జి చేయడం సరైన పద్ధతి కాదని, వారి న్యాయమైన డిమాండ్ కోసం ఆందోళన చేస్తుంటే ఇలాంటి ఆకృత్యాలకు పాల్పడటం సరైన కాదని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 90కి పైగా పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్ర వేస్తూ జైళ్లలో నిర్బంధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ కారణంగా నష్టపోయిన విద్యార్థులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి వ్యతిరేక విధానాల అవలంబిస్తూ విద్యార్థి జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు విజృంభణ ఆధ్వర్యంలో ప్రజాస్వామిక వాదుల, మేధావుల, విద్యార్థి యువకులుతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## తెలంగాణ ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనం విజయవంతం చేయండి

**మంథని, జూలై-20 (ప్రజాతీర్పు)**



తెలంగాణ ఉద్యమకారుల సమస్యలే పరిష్కార ధ్యేయంగా ఉద్యమకారులు సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మంథని పట్టణానికి చెందిన డాక్టర్ కావటి సతీష్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉద్యమకారుల సంఘం ఇన్చార్జిగా పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 16న ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వేదికగా ఆత్మీయ సమ్మేళ నిర్వహించి, ఉద్యమ కార్యచరణ ప్రకటించబోతున్నట్లుగా పిడమర్తి రవి తెలిపారని సతీష్ వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను పరిష్కరిస్తుందనే నమ్మకం ఉందని వారు తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం కమిటీ నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి, మేనిఫెస్టో చైర్మన్ శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో 1969, 2009 ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమకారులను సెప్టెంబర్ 16న నిర్వహించే అపూర్వ సమ్మేళనము కు ఆహ్వానించి గౌరవిస్తామని తెలిపారు.



# ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంపొందాలి

- ప్రైవేట్ స్కూల్ నుంచి ఇద్దరు చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన బీజేపీ నాయకుడు అంజి
- మేరపల్లి, బొంపల్లి పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని వ్యాఖ్య

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 20 :**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన బోధన అందుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యాసంస్థలపై విశ్వాసం పెంపొందించాలని బీజేపీ మండల నాయకుడు బొదాసు అంజి పిలుపునిచ్చారు. బొంపల్లి గ్రామ సర్పంచ్ దాడి మౌనిక--సంతోష్ దంపతులు, గ్రామ పాలకవర్గం సూచన మేరకు ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తన ఇద్దరు పిల్లలను బొంపల్లి గ్రామ పరిధిలోని మేరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం చేర్పించారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలపై ఆధారపడకుండా ప్రభుత్వ పాఠశాలలను ఆదరిస్తే గ్రామీణ విద్య మరింత బలోపేతం అవుతుందని అన్నారు. బొంపల్లి, మేరపల్లి గ్రామాల నుంచి వివిధ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను మేరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు జడ్పీహెచ్ఎస్ బొంపల్లిలో చేర్పించి ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం వల్ల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ విద్యపై సమాజంలో విశ్వాసం కూడా పెరుగుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బొంపల్లి గ్రామ ఉపసర్పంచ్ పంబల రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## 'ప్రతిరోజు ఒక వార్డు' కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ సృజన ఐఏఎస్

**కొంపల్లి, జులై 20 (ప్రజా తీర్పు)**

"ప్రతిరోజు ఒక వార్డ్" కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీమతి సృజన ఐఏఎస్ కొంపల్లి డివిజన్‌లోని ఎన్‌సీఎల్ కాలనీ మరియు నోబుల్ ఎన్‌క్లేవ్ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమైన కమిషనర్ పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా తదితర పౌర సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌సీఎల్ కాలనీ వాసులు డ్రైనేజీ సమస్యతో పాటు కాలనీలో నెలకొన్న ఇతర మౌలిక వసతుల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా కొంపల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని కొంపల్లి మాజీ సర్పంచ్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జెమ్మి దేవేందర్ కమిషనర్ సృజన ఐఏఎస్కు అందజేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బైరీ ప్రశాంత్ గౌడ్, కొంపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అధిరెడ్డి మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ లేబర్ సెల్ అధ్యక్షుడు కందాడి సుదర్శన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ లేబర్ సెల్ అధ్యక్షుడు కావలి గోపాల్ ముదిరాజ్, అంజి ముదిరాజ్, షేక్ ఇబ్రహీం, ఖదీర్, కావలి నవీన్ ముదిరాజ్, ఎన్‌సీఎల్ మరియు నోబుల్ ఎన్‌క్లేవ్ కాలనీ అసోసియేషన్ సభ్యులు సారికా రెడ్డి, శశిధర్, నాగరాజ్, అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## తరగతులకు రోజూ హాజరుకావాలి

### ప్రణాళిక ప్రకారం చదవాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జూలై 20**

వేములవాడ పట్టణంలోని మహాత్మాజ్యోతి బాపూలే రెసిడెన్షియల్ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కిచెన్ లోకి వెళ్లి పరిసరాలు, మెనూ చార్ట్ ప్రకారం భోజనం సిద్ధం చేశారా అని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో బియ్యం, పప్పులు గుడ్లు, ఇతర ఆహార పదార్థాల నాణ్యత, రిజిస్టర్లను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు అందరూ రోజూ తరగతులకు హాజరు కావాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం చదవాలని, గత ప్రశ్న పత్రాలు సాధన చేయాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని తెలిపారు. రోజు తీరిక సమయంలో ఆటలు ఆడాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తినకముందు తిన్న తర్వాత చేతులు కడుక్కోవాలని తెలిపారు.

# ఉద్యమంలా 'తెలంగాణ జలసిరి' కార్యక్రమం చేపట్టాలి

### ఊరూరా ఇంకుడుగుంతలు, ఊట కుంటలు నిర్మించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, జూలై 20 (ప్రజా తీర్పు ప్రతినిధి)**




ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు పిలుపునిచ్చారు. వీబీజీ రామ్-జీ (ఎదీ+-=ూవీ-+) పథకం కింద గ్రామాల్లో ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ జలసిరి పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, డీఆర్డీఓ గీతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాలని అన్నారు. వీబీజీ రామ్-జీ పథకం కింద ప్రభుత్వం ఇంకుడుగుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ పనులు చేపడుతోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన గ్రామాభివృద్ధి లక్ష్యంగా వీబీజీ రామ్-జీ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యానవన, భూగర్భ జలాలు, గనులు-భూగర్భ శాస్త్రం, మత్స్య, ప్రణాళిక, విద్యుత్ శాఖలతో పాటు స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణం) అధికారులు పరస్పర సహకారంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగ గుగులోత్ రామ్ చందర్ ఎన్నిక

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) జులై 20**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పారిశ్రామిక పట్టణం పాల్వంచలో ఈనెల 18. 19 తేదీలలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య మూడవ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు హాజరైనారు. టేకులపల్లి మండలానికి చెందిన సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కౌన్సిల్ సభ్యుడు టేకులపల్లి మండల కార్యదర్శి గుగు లోత్ రామ్ చందర్ ను తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రామ్ చందర్ మాట్లాడుతూ గిరిజన హక్కుల సాధనకు కృషి చేస్తానని. ఏజెన్సీ చట్టాల పరిరక్షణకు ఉద్యమిస్తానని. పాలకులు గిరిజన ప్రాంతాల్లో హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. తరతరాలుగా అడవిని నమ్ముకొని బ్రతుకుతున్న గిరిజన బిడ్డలను భూములకు దూరం చేసే కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. పోడు సాగుదారులపై దాడులు నిర్బంధాలను అడ్డుకుంటామన్నారు. గిరిజన సమాఖ్య బలోపేతం ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న పోడు భూముల పట్టాలు పంపిణీ తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంతో నమ్మకముతో గిరిజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా బాధ్యతలు ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర గిరిజన సమైక్య నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఈ-20కి తేమ బెడద.. ఇథనాల్ హైగ్రోస్కోపిక్ స్వభావంతో ఇంధనం కలుషితం

ఈ-20 ఇంధనంతో నా వెహికల్ మైలేజీ పడిపోయిందని ఒకరు.. ఇంజిన్ పాడైందని మరొకరు.. సోషల్ మీడియాలో ఇలా పలు వీడియోలు వైరలవుతున్నాయి. ఈ-20 పెట్రోల్ వాడాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొన్నది. మరి ఈ-20 పెట్రోల్ వాడొచ్చా.. వెహికల్స్ ఎందుకు పాడవుతున్నాయి.. అంటే అందుకు ప్రధాన కారణం ఇంధనం కలుషితం కావడమే. ఇథనాల్‌కు ఉన్న హైగ్రోస్కోపిక్ స్వభావం లేదా వాతావరణంలోని తేమను ఆకర్షించే గుణం వల్ల వర్షాకాలంలో, తీరప్రాంతాల్లో తమ వద్ద ఉన్న ఈ-20 ఇంధన నిల్వలు కలుషితమవుతున్నాయని పెట్రోల్ పంప్ యజమానులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత భూగర్భ నిల్వ ట్యాంకులు కేవలం సాధారణ పెట్రోల్‌ను నిల్వ చేయడానికి మాత్రమే రూపొందించబడ్డాయని, ఇంతటి అధిక మోతాదులో ఇథనాల్ మిశ్రమం ఉన్న ఇంధనాన్ని నిల్వ చేయడానికి తగినవి కాకపోవడమే దీనికి ప్రధాన కారణమని వారు చెప్తున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన కొన్ని వీడియోల ఆధారంగా ఈ ఆందోళనలు తెరపైకి వచ్చాయి. ఆ వీడియోలలో పెట్రోల్ పంపుల నుంచి ఈ-20 ఇంధనానికి బదులుగా బురద రంగులో ఉన్న నీటిలాంటి ద్రవం వస్తున్నట్టుగా కనిపించింది.



## ప్రజలకు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు

- నూతన చేతి పంపు ప్రారంభించిన కౌన్సిలర్ గుర్రం కావ్య పరశురాం

**జమ్మికుంట జూలై 20 ప్రజాతీర్పు**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు స్థానిక కౌన్సిలర్ గుర్రం కావ్య పరశురాం ఆధ్వర్యంలో నూతన చేతి పంపు ను ప్రారంభించారు. వార్డులో కొంతకాలంగా తాగునీటి కొరత ఎదురవుతుండటంతో స్థానిక ప్రజల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ బోర్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ గుర్రం కావ్య పరశురాం మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా తాగునీటి వంటి ప్రాథమిక అవసరాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన చేతి పంపు ద్వారా 20వ వార్డులోని పలువురు కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను గుర్తించి వెంటనే పరిష్కారం చూపిన కౌన్సిలర్‌కు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## లోకల్స్‌కు 'లోకల్ పాస్'.. టోల్‌ప్లాజాలకు 20 కి.మీ పరిధిలోని వారికి కొత్త ఫీచర్

టోల్ ప్లాజాలకు 20 కిలోమీటర్ల పరిధిలో ఉండే నివాసితుల కోసం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) సరికొత్తగా 'లోకల్ పాస్' అనే ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. అర్హత కలిగినవాళ్లు 'రాజమార్గయాత్ర' యాప్‌లో లోకల్ పాస్‌లను కొనుగోలు చేయవచ్చునని, ఇది ఆయా టోల్ ప్లాజాల గుండా అపరిమిత ప్రయాణానికి అనుమతిస్తుందని ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. ఢిల్లీలోని అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-2లోని ముండ్కా-బక్కర్‌వాలా టోల్ ప్లాజా వద్ద ఈ ఫీచర్‌ను తొలిసారిగా ప్రవేశపెట్టామని, రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకొస్తున్నట్టు ప్రకటించింది.

# నర్సంపేట బీసీ బాలికల హాస్టళ్లలో సీట్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్

- బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కు వినతిపత్రం
- వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

**నర్సంపేట టౌన్ జూలై 20 ప్రజాతీర్పు**



వరంగల్ జిల్లా నర్సంపేటలో బీసీ బాలికల హాస్టళ్లలో సీట్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గం ఇంచార్జ్ శ్రీనివాస్ ముదిరాజ్ రెవెన్యూ డివిజన్ అధికారి(ఆర్డీఓ) ఉమారాణి కి బిసి సంఘం నాయకులతో పాటు బిసి విద్యార్థినులతో కలిసి వినతిపత్రం పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం నుండి వివిధ కోర్సులు చదవడానికి పెద్ద మొత్తంలో విద్యార్థులు నర్సంపేట కళాశాలలో చదువుకోడానికి వస్తున్నారని అన్నారు. ఈ విద్యా సంవత్సరం కూడా నర్సంపేటలో విద్యార్థినిలు ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, ఫార్మసీ కోర్సుల్లో చదువుకోడానికి రాష్ట్ర వ్యాప్తంగా సుదూర ప్రాంతాల నుండి విద్యార్థులు వస్తున్నారని దీనికి కారణం వరంగల్ హనుమకొండ తర్వాత నర్సంపేట విద్యా కేంద్రంగా విరాజిల్లుతుండడమే దీనికి నిదర్శనం అని అన్నారు. నర్సంపేట ప్రాంతంలో చదువుకునే పేద మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ హాస్టళ్లు ఉంటే తప్ప చదవలేని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం అన్నారు. కేవలం ప్రభుత్వ హాస్టళ్ల మీదనే ఆధారపడి చదువు కొనసాగించే కుటుంబాలకు చెందిన వారే ఎక్కువ శాతం ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేటలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు చదువుకోడానికి హాస్టళ్లలో తగినన్ని సీట్లు వారికి ఉన్నాయని కానీ ఎక్కువ శాతం ఉన్న బీసీ విద్యార్థులకు అరకొర సీట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. నర్సంపేటలో ఉన్న రెండు బీసీ బాలికల హాస్టళ్లలో బీసీ విద్యార్థినిలకు సీట్లు లేవని చెప్పి వెనక్కి పంపిస్తున్నారని చాలామంది విద్యార్థులు నర్సంపేట ఏరియా కళాశాలలో సీట్లు వచ్చి హాస్టల్స్ లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ బాలికల హాస్టళ్లలో సీట్లు లేకపోతే ఉన్నత చదువు చదువుకోవాలనే తపన ఉన్న విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేసే ప్రమాదం పొంచి ఉన్నదని ఇది విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కాబట్టి బీసీ బాలికల హాస్టల్ లో సీట్ల సంఖ్యను పెంచాలని ప్రజావాణి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరుగుతుందని అవసరమైతే నర్సంపేటలో మరొక బీసీ హాస్టల్ ను మంజూరు చేసి పేద మధ్య తరగతి బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వం మరొక హాస్టల్ ఏర్పాటు చేసే వరకు బీసీ సంక్షేమ సంఘం సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టడం జరుగుతుందని ప్రభుత్వాన్ని డ్యాగల శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి బోనగాని రవీందర్, నర్సంపేట పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, పట్టణ సహాయ కార్యదర్శి శీరంశెట్టి రాజేందర్ పెరక, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కందికొండ సురేష్, బోళ్ల రవీందర్, గుంటుక రాజ్ కుమార్ విద్యార్థినులు బగాయుత్ సిరి, వేమునూరి సాయి సింధుజ, రమ్యశ్రీ, రజిని, ర శ్రీవల్లి, సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

# సర్‌తోనే ఓటరుగా గుర్తింపు

- సకాలంలో ఫారాలు సమర్పించాలి: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**రామడుగు/గంగాధర, జూలై 20 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా గుర్తింపు పొందే అవకాశం ఉందని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో ఇప్పటికే 80 శాతం సర్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. గంగాధర మండలం మధురానగర్‌లో సోమవారం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి, బీఎల్‌వోలు అందజేసిన ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో నింపి తిరిగి సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ప్రజలు బీఎల్‌వోలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. గ్రామాల్లో ఇప్పటికే బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేశారని, వాటిని సకాలంలో సమర్పించడం ద్వారా ఓటరు జాబితా మరింత పారదర్శకంగా రూపొందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. మరణించిన వారి పేర్లు, డబుల్ ఓట్లను తొలగించేందుకు సర్ ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా సర్ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పిస్తూ బీఎల్‌వోలకు సహకరించాలని సూచించారు. ప్రతి ఒక్కరి సహకారంతో సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాము, ఎమ్మార్వో రజిత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంత్రి మహేందర్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్‌రావు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, మాజీ జెడ్పీటీసీ సత్తు కనకయ్య, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, పలువురు సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## నర్సంపేటలో 108 అంబులెన్స్ సేవలపై ప్రచురిత కథనానికి జీవీకే ఈ ఎం ఆర్ ఐ వివరణ

- నిరాధార కథనంపై స్పందించిన 108 ప్రోగ్రాం మేనేజర్ పాటి శివ కుమార్

**నర్సంపేట టౌన్ జులై 20 ప్రజా తీర్పు**



ప్రజలకు అత్యవసర సేవలందిస్తున్న 108పై నిరాధార ప్రచారం సరికాదు జిల్లా మేనేజర్‌లి లిభరత్ కుమార్ ఇటీవల స్థానిక జనం స్ఫూర్తి పత్రికలో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో జీవీక్ ఈ ఎం ఆర్ ఐ 108 అత్యవసర అంబులెన్స్ సేవలపై ప్రచురితమైన కథనం వివాదాస్పదంగా మారింది. ఆ కథనంలో సంస్థ మరియు సిబ్బందిపై చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని జి వి కె ఈ ఎం ఆర్ ఐ 108 సర్వీసెస్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా 108/102 సర్వీసెస్ ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ సంబంధిత కథనంపై స్పందించి, జనం స్ఫూర్తి పత్రిక ప్రతినిధి మరియు యాజమాన్యాన్ని వివరణ కోరినట్లు తెలిసింది. అనంతరం జరిగిన పరిశీలనలో, కథనంలో పేర్కొన్న ఆరోపణలకు తగిన ఆధారాలు సమర్పించబడలేదని, నర్సంపేటలో జీూ ప్రైవేట్ అంబులెన్స్ సర్వీస్ నిర్వహిస్తున్న వ్యక్తి ఉద్దేశపూర్వకంగా జి వి కె ఈ ఎం ఆర్ ఐ 108 సంస్థ మరియు సిబ్బందిపై తప్పుడు ప్రచారం చేసినట్లు తమకు సమాచారం అందిందని పత్రిక యాజమాన్యం వివరణ ఇచ్చినట్లు వెల్లడైంది. ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందిస్తున్న జి వి కె ఈ ఎం ఆర్ ఐ 108 సర్వీసెస్ సంస్థ ప్రతిష్ఠకు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది గౌరవానికి భంగం కలిగించేలా ధృవీకరణ లేని సమాచారాన్ని ప్రచురించడం సమంజసం కాదని అధికారులు పేర్కొన్నారు.అదేవిధంగా, సేవలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని సంబంధిత అధికారులకు సరైన ఆధారాలతో తెలియజేయాలని, వాస్తవాలను నిర్ధారించిన తరువాతే వార్తలను ప్రచురించడం మీడియా బాధ్యత అని వారు సూచించారు.





## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్ సింగ్ నాయక్ చొరవతో మార్కెట్ యార్డు పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

**(జక్కుల పాల్గుణ, ప్రజా తీర్పు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా) జూలై 20**

కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ యార్డులో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ బానోత్ లాల్ సింగ్ నాయక్ సోమవారం పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించారు. రైతులు, వ్యాపారులు పరిశుభ్రమైన వాతావరణంలో మార్కెట్ సేవలను పొందేలా అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చిన్నపాటి వర్షానికే ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటితో మార్కెట్ యార్డులోని షాపింగ్ కాంప్లెక్స్ పరిసరాల్లో నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని ఆయన గుర్తించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, డ్రైనేజీలను పూర్తిగా శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం, చెత్త సేకరణ పనులను వెంటనే చేపట్టాలని సంజయ్‌నగర్ సర్పంచ్ తాటి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమలు, ఈగలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సిబ్బందికి ఆదేశించారు. రైతులు తమ పంటలను విక్రయించేందుకు మార్కెట్‌కు వచ్చే సమయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం తమ ప్రధాన బాధ్యత అని బానోత్ లాల్ సింగ్ నాయక్ తెలిపారు. పరిశుభ్రమైన మార్కెట్ యార్డు ద్వారా రైతులు, వ్యాపారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి, ఏఎంసీ సిబ్బంది, పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నాయకులపై కేసులు ఎత్తివేయాలి

- రహదారి దిగ్బంధం కేసు విచారణకు హాజరైన ఎమ్మార్పీఎస్ నాయకులు
- ఎస్సీ వర్గీకరణ పోరాటాలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

**( కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) జూలై 20**




ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు 2022లో మల్యాల ఎక్స్‌రోడ్ వద్ద నిర్వహించిన రహదారి దిగ్బంధం సందర్భంగా నమోదైన కేసు విచారణలో భాగంగా ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం జగిత్యాల కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ఎమ్మార్పీఎస్ నాయకులు మీసాల సాయిలు, నక్క సతీష్, బొల్లె అనిల్ లపై మల్యాల పోలీసులు కేసు నమోదు చేయగా, విచారణ ప్రక్రియలో భాగంగా వారు ఎమ్మార్పీఎస్ తరపున న్యాయవాది బిరుదుల లక్ష్మణ్ తో కలిసి కోర్టుకు హాజరై న్యాయపరమైన ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ సాధన పోరాటాల ఫలితమేనని, ఉద్యమ నాయకులపై నమోదు చేసిన కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం కోసం ఉద్యమించిన నాయకులపై కేసులు కొనసాగించడం సరైన చర్య కాదని, ఉద్యమాల పట్ల ప్రభుత్వం సానుకూల వైఖరి ప్రదర్శించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడిన ఎమ్మార్పీఎస్ నాయకులపై నమోదైన అన్ని కేసులను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకుని, ఉద్యమకారులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఉద్యమకారులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి

- ఉద్యమకారుల ఫోరం నాయకుల డిమాండ్

**మంథని, జూలై-20 (ప్రజాతీర్పు)**



తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలం, ఉపాధి, వైద్యం, పెన్షన్‌తో కూడిన సమగ్ర సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ మంథని నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న అమరుల జ్యోతి వద్ద కేకే కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమకారులతో సంప్రదింపుల ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాల ఉద్యమకారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేకే కమిటీ సభ్యులు కేకే, ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. మంథనికి చెందిన ఉద్యమకారులు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు కమిటీ ముందు హాజరై పలు సూచనలు చేశారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని వారు కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, నెలకు 25 వేల రూపాయల పెన్షన్, 1000 కోట్ల రూపాయలతో ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు, ఉచిత వైద్యం, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాల్లో 20శాతం వాటా కల్పించాలని, ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్య వంటి సంక్షేమ పథకాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం కమిటీ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు ఉద్యమకారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి ఎక్కేటి అనంతరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేల్పుల గట్టయ్య, ఉద్యమకారులు దేవళ్ళ విజయ్ కుమార్, కంకణాల తిరుపతిరెడ్డి, మట్ట రాజయ్య, పంతకాని రవి, పోరెడ్డి వెంకటరెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు

# హమాలి కార్మికుల జీతాలు వెంటనే ఇవ్వాలి

రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్

**నర్సంపేట టౌన్ జూలై 20 ప్రజా తీర్పు**





స్థానిక నర్సంపేట పట్టణము యందు 20 జూలై 2026 సోమవారం రోజున తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై హమాలీ కార్మికుల యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు దేవన బోయిన రాంబాబు ఆధ్వర్యంలో అమాలి కార్మికుల వేతనాలు ప్రతినెల సమయపాలన పాటిస్తూ చెల్లించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించగా రాష్ట్ర అధ్యక్షులు, నాయకులు పాల్గొనగా వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం గేటు ముందట ధర్నా చేసి తదుపరి కలెక్టర్ శారదా కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ పాల్గొని మాట్లాడుతూ వరంగల్ జిల్లా లో అన్ని సివిల్ సప్లై గోదాములలో హమాలి కార్మికులు నెల రోజులు అంటూ మూడు నెలలుగా పని చేయగా జీతాల జాప్యంతో కేంద్రం 60 శాతం రాష్ట్రం 40% అంటూ విభజన రూపంలో నెలసరి జీతాలు మరో నెల వచ్చే వరకు కూడా జీతాలు ఆలస్యంగా కుటుంబ ఆర్థిక ఇబ్బందులకు అనేక రకాలుగా కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు మరియు కేంద్రం మూడు నెలలుగా బియ్యం పంపిణీ చేయాలని తెలపడం కార్మికుడి కుటుంబ ఆర్థికానికి కుంటుపడే పరిస్థితి వల్ల ప్రతినెల ఐదో తారీకు కార్మికుల అకౌంట్లో జీతాలు జమ చేయాలని డిమాండ్ చేశారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వారు రాష్ట్ర అధ్యక్షులు గుంపల్లి మునీశ్వర్ జలగం బిక్షపతి ముద్ర బోయిన మహేందర్, కందిక చెన్నకేశవులు, గోవర్ధన్ మియాపురం దేవనబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు



## వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు ప్రారంభం

- వార్డు మెంబర్స్ కు 20 నుంచి 24 వరకు శిక్షణ తరగతులు : ఎంపీడీవో మంగమ్మ.

**(పగడాల. రామారావు ప్రజా తీర్పు గాల మండల ప్రతినిధి) జులై 20**

గార్ల .. గ్రామపంచాయతీ పరిధిలో గల ఆ,యా వార్డు గ్రామ ప్రజలు సమస్యల పరిష్కారంలో, వార్డు సభ్యులు కీలక పాత్ర వహించాలని ఎంపీడీవో మంగమ్మ సూచించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక పట్టణ శివారు రైతు వేదికలో ఐదు రోజులపాటు వార్డు సభ్యులు తర్ఫీదు పొందేందుకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. మొదటి విడత శిక్షణలో మండల పరిధి బాలాజీ తండా, బిఆర్ఎన్ తండా, బుద్ధారం, చిన్న బంజర, చిన్న కిష్టాపురం, గార్ల ,గోపాలపురం, కోట్యా నాయక్ తండా, మద్దివంచ మర్రిగూడెం, గ్రామ పంచాయతీల కు చెందిన వార్డు సభ్యులు శిక్షణకు హాజరైనారు. కోర్స్ డైరెక్టర్ గా ఎంపీడీవో మంగమ్మ వ్యవహరించగా, కన్వీనర్ గా ఎంపీఓ శ్రీలక్ష్మి, వ్యవహరించగా నలుగురు ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ టి ఓ టి, గ్రామపంచాయతీ కార్యదర్శి మధు నాయుడు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. వార్డు సభ్యులకు కరదీపికలను నోట్బుక్ పెన్, భోజన వసతిని కల్పించారు.



## వీవోఏ పట్ల ఫీల్డ్ ఆఫీసర్ నిర్లక్ష్య వైఖైరి వీడానాడాలని డిమాండ్

- సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన

**(పగడాల. రామారావు ప్రజా తీర్పు గాల మండల ప్రతినిధి) జులై 20**

గార్ల: ఓటిఎస్ పూర్తిచేసిన డ్వాక్రా సంఘాలకు తిరిగి రుణాలు మంజూరు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఐకెపి వివోఏ ల సమస్యలను పరిష్కరించాలని ఐకెపి వివోఏ ల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్ బి ఐ బ్యాంక్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాల డాక్యుమెంటేషన్ బ్యాంకు లోనే చెల్లించాలని, డాక్యుమెంట్ రికవరీ ఫీజుల పేరిట అధిక చార్జీలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సంఘం సభ్యులు లీడర్ల ప్రేమయం లేకుండా సంఘాల ఖాతాలలో అప్పులను జమ చేయవద్దని కోరారు. నెలల తరబడి గ్రూపులను బ్యాంకు చుట్టూ తిప్పవద్దని, వివో ఏ ల పట్ల ఫీల్డ్ ఆఫీసర్ నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారులిఈ కార్యక్రమం లో వివోఏ ల ఉద్యోగుల సంఘం నాయకులు సి హెచ్.మౌనిక, అనిత, వినోద, అరుణ, కల్పన,లత, స్వర్ణ, విజయ, సునీత, విజయ్, జ్యోతి, రజని, శారద, పాల్గొన్నారు.



## గ్రామ స్థాయిలో పోలీసింగ్ బలోపేతం చేయాలి: ఎస్పీ శబరీష్

**(పగడాల రామారావు ప్రజాతీర్పు గార్ల మండల ప్రతినిధి) జూలై 20**

గార్ల, జూలై 20: గ్రామ స్థాయిలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్, పోలీసు సిబ్బందికి సూచించారు. సోమవారం గార్ల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు ఫైళ్లు, పెండింగ్ కేసుల పురోగతి, మాల్ఖానా, రిసెప్షన్, రికార్డు నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. కేసుల దర్యాప్తు నాణ్యతను పెంచుతూ చట్టపరమైన నిబంధనలు పాటించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారి విధుల నిర్వహణ, సమస్యలు, పనితీరుపై ఆరా తీశారు. ముఖ్యంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్లతో (వీపీఓలు) ప్రత్యేకంగా మాట్లాడి, గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించడం, స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండడం, గ్రామ పెద్దలు, యువత, ప్రజాప్రతినిధులతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి రవాణా, విక్రయాలు, ఇతర మత్తు పదార్థాల వినియోగంపై నిరంతరం నిఘా ఉంచాలని, అనుమానాస్పద సమాచారం లభించిన వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సమర్థవంతమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

## తొలి డెంగీ వ్యాక్సిన్ వచ్చేసింది

తొలి డెంగీ వ్యాక్సిన్‌కు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. జపాన్‌కు చెందిన టకెడా బయోఫార్మాస్యూటికల్స్ అభివృద్ధి చేసిన ఈ క్యూ డెంగా వ్యాక్సిన్‌ను 4 ఏండ్ల నుంచి 60 ఏండ్ల వయసు వారికి వేయొచ్చు. గతంలో డెంగీ వచ్చిందా లేదా అనేదాంతో సంబంధం లేకుండా ముందస్తు వ్యాక్సిన్ టెస్టులు లేకుండానే ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చు. ఈ వ్యాక్సిన్ నాణ్యత, భద్రత, సమర్థత విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి సర్టిఫికెట్ పొందింది. డెంగీ ఎక్కువగా ఉన్న దేశాల్లో దీన్ని డబ్ల్యూహెచ్‌వో ప్రతిపాదిస్తోంది. ఇప్పటికే ఈ వ్యాక్సిన్ వల్ల డెంగీతో సతమతం అవుతున్న దేశ ప్రజలకు పెద్ద ఊరట లభిస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.



## గొల్లపెల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ చెస్ దినోత్సవం

**( కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) జులై 20**


అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గొల్లపెల్లి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, యువతకు చెస్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను (సర్టిఫికెట్లు) అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్ మాట్లాడుతూ, చెస్ క్రీడ మానసిక వికాసానికి, ఆలోచనా శక్తి పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుంది. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి మేధోపరమైన క్రీడల్లో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి మహంకాళి చంద్రశేఖర్, కోశాధికారి సట్ట సురేష్ , ఫాస్ట్ ప్రెసిడెంట్ ముస్కు కరుణాకర్ రెడ్డి, ఫాస్ట్ కార్యదర్శి నరహరి, ప్రిన్సిపాల్ సుంకరి రవి క్లబ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠి ఛార్జ్ దేనికి సంకేతం?

- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్ కుమార్

**హుస్నాబాద్ జులై 20 ప్రజా తీర్పు రవీందర్**



న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద "చలో పార్లమెంట్" కార్యక్రమంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు జరిపిన అమానుష లాఠీచార్జ్, అక్రమ నిర్బంధాలు, దమనకాండను ఏఐవైఎఫ్ తెలంగాణా రాష్ట్ర సమితి పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్ కుమార్ పేర్కొన్నారు.తమ రాజ్యాంగబద్ధమైన హక్కులను వినియోగించుకుంటూ నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులను అడ్డుకునేందుకు 7 అడుగుల ఇనుప బ్యారికేడ్లను వెల్డింగ్ చేయడం, మెట్రో స్టేషన్లను విద్యార్థులు లోపల ఉండగానే మూసివేయడం, వేలాది మంది పోలీసు బలగాలను మోహరించడం, విద్యార్థులను ఈడ్చుకెళ్లి బలవంతంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య భారతదేశానికి సిగ్గుచేటని మండిపడ్డారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం పోలీసు లాఠీలతో స్పందిస్తూ మోదీ ప్రభుత్వ నిరంకుశ, ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఎన్టీఏలో చోటుచేసుకున్న అవినీతి, వరుస పరీక్షా కుంభకోణాలు, పారదర్శకత లోపం కారణంగా దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. ఈ కుంభకోణాల నేపథ్యంలో ఇప్పటికే 17 మంది యువ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా, కేంద్ర ప్రభుత్వం వారి కుటుంబాల ఆవేదనను, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ విద్యా వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉన్నప్పటికీ, దీనికి రాజకీయ బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తప్పించకుండా కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు.దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థులను నేరస్థుల్లా చూడడం మానుకోవాలని, వారి గొంతును అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కు అని, ఆ హక్కును కాలరాసే ప్రతి చర్యను ఏఐవైఎఫ్ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థి--యువజన ఉద్యమాలకు ఏఐవైఎఫ్ అండగా నిలుస్తుందని, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థ, ఎన్టీఏలో సమగ్ర సంస్కరణలు, విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు తమ పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని వారు ప్రకటించారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థులపై నమోదు చేసిన అన్ని కేసులను బేషరతుగా ఎత్తివేయాలి, అక్రమంగా నిర్బంధించిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలి, లాఠీచార్జ్‌కి బాధ్యులైన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలి, విద్యార్థి సంఘాలతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఋతుపరిస్థితులపై ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

జులై 25 వరకు గ్రామసభలు ఎంపీడీవో వి. సురేష్

**హుస్నాబాద్ జులై 20 ప్రజాతీర్పు రవీందర్**



ఋతుపరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సంరక్షణ, వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు వారం రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హుస్నాబాద్ ఎంపీడీవో వి. సురేష్ తెలిపారు. సిద్ధిపేట జిల్లా కలెక్టర్, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు హుస్నాబాద్ మండలంలో ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్‌పామ్ సాగు, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, బోరు బావుల రీచార్జి గుంతలు, వన మహోత్సవం, స్వచ్ఛ భారత్ మిషన్--2026, తాగునీటి సంరక్షణ, డ్రై డే కార్యక్రమాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. గ్రామసభలకు ముందు రోజు డప్పు ప్రచారం నిర్వహించాలని, ప్రతి గ్రామంలో కనీసం 50 మంది ఉపాధి హామీ కూలీలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో సర్పంచులు, వ్యవసాయ, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొంటారని తెలిపారు.గ్రామసభల షెడ్యూల్: 20న: మదద, రాములపల్లి, మహమ్మదాపూర్ 22న: పొట్లపల్లి, పందిళ్ళ, బంజేరుపల్లి, మాలపల్లి 23న: పోతారం (ఎస్), గాంధీనగర్, కుచనపల్లి, జిల్లెల్లగడ్డ 24న: తోటపల్లి, వంగరామయ్యపల్లి, మీర్జాపూర్, బల్లు నాయక్ తండా 25న: నాగారం, ఉమ్మాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి. సురేష్ తెలిపారు.

## నస్పూర్ యూనియన్ బ్యాంక్ ఎదుట సింగరేణి విశ్రాంత ఉద్యోగుల నిరసన

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) జూలై 20**



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నస్పూర్ లోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా కార్యాలయం ముందు ాదీ× బ్యాంకు మాదిరిగానే యూనియన్ బ్యాంకు లో ఖాతాలు కలిగి ఉన్న సింగరేణి కోల్ మైన్స్ పెన్షన్ దారులకు 50 లక్షల ప్రమాద బీమా , సహజ మరణానికి 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని యూనియన్ బ్యాంక్ కార్యాలయం ముందు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ బ్యాంకు లకు సంబంధించిన బ్రాంచ్ మేనేజర్ లు , అధికారులు సింగరేణి కోల్ పెన్షన్ దారులకు 70 సంవత్సరాల లోపు ఖాతాలు కలిగి ఉన్న వారికి ప్రమాద భీమా సౌకర్యానికి సంబంధించిన ఒప్పంద పత్రాలలో పూర్తిగా క్లారిటీ లేదని ఈ సందర్భంగా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. అదే విధంగా యూనియన్ బ్యాంకు ఖాత దారులైన బొగ్గు పెన్షన్ దారులకు ప్రమాద బీమా సౌకర్యం , సహజ మరణానికి కూడా భీమా సౌకర్యం ఉన్నదా లేదా అనే విషయం పత్రికల మరియు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మొఖం గా సింగరేణి పెన్షన్ దారులకు పూర్తి స్థాయిలో వివరణ ఇవ్వాలని కోరుతూ నస్పూర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ బోగే సాగర్ వారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, కోశాధికారి బింగి రాజేశం , కార్యదర్శి ఎన్నం శంకర్ , ఆర్గనైజర్ తణుకుల మోహన్ , జిల్లా ఏరియా నాయకులు సంగెం రాంచందర్ , మేడ రాజలింగు , టీ శ్రీహరి , ఎన్ సదాశివ , ఎండి ఖాదర్ , హుస్సేన్ , ఇ రాజనర్సు , రేకుల పర్వతాలు , బి ఒదయ్య, ంఎ అబ్బాస్ అలీ , బాజీ రెడ్డి సురేష్ , అర్వ మల్లయ్య , ఇరుకుల జనార్దన్ , పి లక్ష్మయ్య , కె పోచయ్య , ఎస్ బాణయ్య , కె దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్పించాలి 50 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలీ కల్పించాలి సహజ మరణానికి 10 లక్షల ప్రమాద బీమా వర్ధిల్లాలి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి అని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.



## ప్రభుత్వం చేప /రొయ్య పిల్లలకు కొనుగోలుకు ప్రతి మత్స్య సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలి

- మంచిర్యాల జిల్లాలోని కార్పొరేషన్ /మున్సిపాలిటీ / మండల కేంద్రాలలో చేపల మార్కెట్లో నిర్మించాలి

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) జూలై 20**

తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి ఏవో గారికి , మత్స్యశాఖ ఏడి గారికి పలు సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బోడెంకి చందు మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పేరుతో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లు, అధికారులు తినంగా మిగిలింది మత్స్యకారులకు ఉచిత చేప పిల్లలు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంవత్సరశీ ఉచిత చాప పిల్లలకు కూడా బడ్జెట్ కేటాయించకుండా తీవ్రమైన అన్యాయం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం బడ్జెట్లో బడా పెట్టుబడిదారులకు సంపన్న వర్గాలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు వారి ప్రయోజనాలను కాపాడుతున్నాయి. మత్స్యకారులు ప్రాణాలను లెక్కచేయకుండా కోట్లాదిమంది ప్రజలకు పోషకాహారాన్ని ఈ దేశానికి రాష్ట్రానికి వేల కోట్ల రూపాయలు సంపాదించి పెడుతున్న మత్స్యకారులకు బడ్జెట్లో న్యాయంగా రావాల్సిన వాట దక్కడం లేదు. ప్రతి మత్స్య సొసైటీ జల వనరులకు సరిపడేంత చేప/ రొయ్య పిల్లలకు కొనుగోలు కోసం 100% సబ్సిడీతో నేరుగా మత్స్య సొసైటీ ఖాతాలోని నగదు జమ చేయాలి. పెండింగ్లో ఉన్న ఇన్సూరెన్స్ సెక్స్ విషయం చెల్లించాలి. జిల్లాలోని కార్పొరేషన్ లో మూడెకరాల స్థలం కేటాయించి 200 కోట్ల రూపాయలతో 10 హోల్సేల్ చాపల మార్కెట్లు, మున్సిపాలిటీలలో ఎకరా స్థలం కేటాయించి 100 కోట్ల రూపాయలతో 100 రిటైల్ చేపల మార్కెట్లు, మరియు ప్రతి మండల కేంద్రంలో చాపల మార్కెట్లో నిర్మించాలి. ఎండిపోయిన చెరువులు కుంటలకు లీజులు రద్దు చేయాలి. చెరువులు కబ్జా కాకుండా ఫెన్సింగ్ వేయాలి. మత్స్యకారులకు టూ వీలర్, ఫోర్ వీలర్, 90% సబ్సిడీతో అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచర్ల రాజేందర్ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు, బోయరి రాజకుమార్ , జూనియరి నారాయణ జిల్లా ఉపాధ్యక్షులు, మత్స్యకారుల సంఘం నాయకులు గుమ్మల శ్రీనివాస్,మొగుర్ల మహేష్, మల్లేష్, చంద్రశేఖర్ భూమయ్య, పిడుగు శ్రీనివాస్, సతీష్, రవి చిలుకయ్య, సిహెచ్ రాజ్ కుమార్, గగ్గూరు రాజన్న, నరేష్, మనోహర్ పాల్గొన్నారు.

## ప్రజల ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం.. సూర్యాపేట డివిజన్ డిఎస్పీ ప్రసన్న కుమార్.

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 20**




ఈరోజు సూర్యాపేట డివిజన్ కార్యాలయం నందు డిఎస్పీ ప్రసన్న కుమార్ పోలీస్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి బాధితుల నుండి పిర్యాదులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. సమస్యలు సంభదిత అధికారులకు ఆదేశాలు ఇచ్చి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఎస్పి నరసింహ ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు ప్రతి సోమవారం డివిజన్ స్థాయి పోలీస్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగినది అని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపినారు.



## 15 ఏళ్ల కోర్టు వివాదానికి తెరదింపిన మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్

ఘనంగా సన్మానించిన ఓల్డ్ నేరేడ్మెట్ గౌడ సంఘం

**(వినోద్, ప్రజా తీర్పు, మల్కాజిగిరి, మేడ్చల్ జిల్లా) జులై 20**

ఓల్డ్ నేరేడుమెట్ గౌడ కులస్తులకు చెందిన స్మశాన వాటిక స్థలం, గత 15 ఏళ్లుగా కోర్టు వివాదాల సమస్యల్లో ఉంది, ఈ సమస్యపై కోర్టు గత 15 రోజుల క్రితం గౌడ కులస్తులకు అనుకూలంగా తీర్పు వెల్లడించారు. గౌడ కులస్తులకు కోర్టులో అనుకూలంగా తీర్పు రావడంతో శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి సూచన మేరకు వారం రోజుల క్రితం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ ని కలిసి కోర్టు తీర్పు పత్రాలను అందించడం జరిగింది. జోనల్ కమిషనర్ తక్షణమే స్పందించి కోర్టు తీర్పును అనుసరిస్తూ కోర్టు వివాదంలో ఉన్న స్మశాన వాటిక స్థలం గౌడ కులస్తులకు చెందినదిగా ప్రొసీడింగ్స్ పత్రాలను జారీ చేశారు కోర్టు కేసు విచారణను నిరంతరం పర్యవేక్షిస్తూ మా గౌడ కులస్తులకు అండగా నిలిచి తగిన సలహాలు సూచనలు, అందించి మాకు న్యాయం జరిగేలా కృషిచేసిన మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ని వారి కార్యాలయంలో ఓల్డ్ నేరేడ్మెట్ గౌడ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.



## పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 20**

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి గారిని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి గారు ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి గారు తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## కుప్పకూలిన బ్లూచిప్ షేర్లు.. తీవ్ర అమ్మకాల ఒత్తిడితో 443 పాయింట్లు పతనమైన సెన్సెక్స్



కుప్పకూలిన బ్లూచిప్ షేర్లు.. తీవ్ర అమ్మకాల ఒత్తిడితో 443 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 442.93 పాయింట్లు లేదా 0.57 శాతం కోల్పోయి 77,708.52 వద్ద స్థిరపడింది. దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 442.93 పాయింట్లు లేదా 0.57 శాతం కోల్పోయి 77,708.52 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 783.16 పాయింట్లు పడిపోవడం గమనార్హం. కాగా, భారీ సంస్థల షేర్లను మదుపర్లు పెద్ద ఎత్తున అమ్మేశారు. ఈ క్రమంలోనే యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ల షేర్ విలువలు అత్యధికంగా 5.48 శాతం, 5.12 శాతం చొప్పున దిగజారాయి. ఇటీవలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండటమే కారణమని మార్కెట్ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 95.80 పాయింట్లు లేదా 0.39 శాతం క్షీణించి 24,238.50 వద్ద నిలిచింది.

